Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 183 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 జూలై 2024 గురువారం పేజీలు : 4

## దిశానిర్దేశం లేని బడ్జెట్... మమత విసుర్లు

కోల్‌కతా: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024-25పై పశ్చిమబెంగాల్ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. దిశానిర్దేశం లేని, ప్రజావ్యతిరేక బడ్జెట్ అని అభివర్ణించారు. బడ్జెట్‌లో విజన్ లోపించిందని, పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో రూపొందించారని అని చెప్పారు. "వెలుగు ఎక్కడా కనిపించడం లేదు, అంతా చీకటే" అని అన్నారు. "సామాన్య ప్రజానీకానికి ఒరిగేదేమీ లేదు. పేదలు, ప్రజావ్యతిరేక బడ్జెట్ ఇది. రాజకీయ పక్షపాతంతో కూడుకొంది. కేవలం ఒక పార్టీని బుజ్జగించేందుకు తెచ్చిన బడ్జెట్" అని మమత అన్నారు. బీజేపీపై విమర్శలు గుప్పిస్తూ, ఎన్నికల్లో వాళ్లు చాలా పెద్దపెద్ద వాగ్దానాలు చేసి వాటిని నెరవేర్చలేదని తప్పుపట్టారు.

### ఆ 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు అంటూ ప్రచారం..!

# అసలు బీఆర్ఎస్ స్కెచ్ ఏంటి?




హైదరాబాద్ : దున్నపోతు ఈనిందని ఒకరంటే.. వెళ్లి దుడ్డె పిల్లను కట్టెయ్యి రా.. అని మరొకరు అన్నారంట.... తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పవర్ పాలిటిక్స్‌ను చూస్తే అచ్చంగా ఇలానే చెప్పాల్సి వస్తోంది.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకునేందుకు కాంగ్రెస్ ఓ పక్క పావులు కదుపుతుంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని గులాబీదళం ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. అసలు తెలంగాణలో ఉప ఎన్నికలు జరిగే పరిస్థితి ఉందా? పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు తప్పదా? బీఆర్ఎస్ స్కెచ్ ఏంటి? కాంగ్రెస్ ప్లాన్ ఏంటి?

**క్యాడర్‌లో స్థైర్యం నింపేందుకు ఉప ఎన్నికల ప్రచారం..! :** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల ఎపిసోడ్ ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ఎల్పీ విలీనమంటూ ఇంతకాలం ప్రచారం చేసిన కాంగ్రెస్ అసెంబ్లీ సమావేశాల నాటికి తన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రస్తుతానికి 10 మంది ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకున్న అధికార పక్షం ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలోకి నెట్టేసింది. ఐతే ఫిరాయింపుల చట్టం ప్రకారం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాల్సిందిగా బీఆర్ఎస్ పోరాటం చేస్తోంది. ఇటు స్పీకర్‌ను అటు న్యాయస్థానాన్ని ఒకేసారి ఆశ్రయించిన బీఆర్ఎస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు చెక్ పెట్టేలా చురుగ్గా పావులు కదుపుతోంది. ఇదే సమయంలో ఎమ్మెల్యేలు వలస వెళ్లిన నియోజకవర్గాల్లో క్యాడర్‌లో స్థైర్యం నింపేందుకు ఉప ఎన్నికలు జరగబోతాయంటూ ప్రచారం ప్రారంభించింది. ఫిరాయింపుదారులపై వేటు పడిన వెంటనే ఉప ఎన్నిక జరుగుతుందని మీరే అభ్యర్థి అంటూ కొందరికి భరోసా ఇస్తుండటంతో ఆయా నియోజకవర్గాల్లో రాజకీయం ఆసక్తికరంగా మారుతోంది.

**ఇప్పటినుంచే ఎన్నికల వాతావరణం ఏర్పడేలా చేయాలని ప్లాన్..** ఇప్పటివరకు బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది బీఆర్ఎస్. అసెంబ్లీ వర్షా కాల సమావేశాల్లో ఫిరాయింపుదారులపై అనర్హత వేటు కోసం పట్టుబట్టాలని నిర్ణయించింది గులాబీదళం. మరోవైపు క్యాడర్‌ను కాపాడుకోవాలంటే ఇప్పటినుంచే ఎన్నికల వాతావరణం ఏర్పడేలా చేయాలని ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా పార్టీ క్యాడర్ పటిష్టంగా ఉన్నచోట్ల ప్రత్యామ్నాయ నేతలను ఎంపిక చేసి ఇప్పటి నుంచి ఉప ఎన్నికలు జరుగుతాయన్నట్లే పనిచేయాలని సూచిస్తోంది.

**పార్టీ మారిన వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతలపై ఫోకస్..** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సొంత జిల్లా మెదక్‌లో కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారతారనే ప్రచారం నేపథ్యం ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు రంగంలోకి దిగారు. ఇప్పటికే పార్టీ మారిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్థానంలో ప్రత్యామ్నాయ నేతలపై ఫోకస్ పెట్టారు. ఆ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేతలు కొలను బాల్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డితోపాటు మెట్టు కుమార్‌యాదవ్ ఇన్‌చార్జి పదవి కోసం పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరికి ఇన్‌చార్జిగా ఎంపిక చేసి ఉప ఎన్నికలకు సిద్ధం చేయాలని భావిస్తోంది బీఆర్ఎస్. అదే విధంగా మిగిలిన 9 నియోజకవర్గాలపైనా ఫోకస్ చేసింది గులాబీ పార్టీ.

**ప్రత్యామ్నాయ నేతలను సిద్ధంగా ఉండాలని సూచిస్తుండటం హాట్ టాపిక్..** ఒకవైపు ఎమ్మెల్యేలు చేజారకుండా చూసుకుంటూనే%ొ% పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించాలని పట్టుబడుతున్న బీఆర్ఎస్%ొ% కొన్ని నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ నేతలను సిద్ధంగా ఉండాలని సూచిస్తుండటం హాట్‌టాపిక్‌గా మారింది. కారు పార్టీకి గట్టిపట్టున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పార్టీ మారగా, ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా సీనియర్ నేత ఓరుగంటి రమణారావు, జడ్పీ చైర్‌పర్సన్ దేవ వసంత పోటీ పడుతున్నారు. రమణారావు 2014 వరకు బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఇక జడ్పీ చైర్ పర్సన్ వసంత ఎమ్మెల్సీ కవిత వర్గంగా ముద్రపడ్డారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా బీఆర్ఎస్‌లో ఉండగా, కవితతో సన్నిహితంగా ఉండేవారు. దీంతో జగిత్యాలలో ఉప ఎన్నిక జరిగితే ఎమ్మెల్సీ కవిత నిర్ణయమే కీలకం కానుందంటున్నారు. అదేవిధంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ వీడారు. దీంతో ఖైరతాబాద్ ఇన్‌చార్జి పదవి కోసం మన్నె గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నేత దాసోజు శ్రవణ్ పోటీపడుతున్నారు. ఈ ఇద్దరు గతంలో వేర్వేరు పార్టీల తరఫున ఖైరతాబాద్ నుంచి పోటీ చేశారు. ఇప్పుడు ఉప ఎన్నిక జరిగితే మళ్లీ రంగంలో నిలుస్తామంటూ అధిష్టానానికి తమ మనోభీష్టాన్ని తెలియజేశారని తెలుస్తోంది.

**గట్టి అభ్యర్థులను రెడీ చేస్తున్న బీఆర్ఎస్..** ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ నేత కడియం పార్టీ మారడంతో ఆయన స్థానంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు మాజీ మంత్రి రాజయ్య. ఏ క్షణంలో ఉపఎన్నిక జరిగినా%ొ% తాను రెడీ అంటూ అప్పుడే ప్రచారం కూడా ప్రారంభించారు. ఇదే విధంగా బాన్సువాడ, భద్రాచలం, గద్వాల, చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు గట్టి అభ్యర్థులను రెడీ చేస్తోంది బీఆర్ఎస్. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందో%ొ% లేదో.. ఇంకా తేలకముందే బీఆర్ఎస్ సన్నద్ధం అవ్వడం పార్టీ క్యాడర్‌ను నిలపుకోడానికే అన్న చర్చ జరుగుతోంది.

## పునర్విభజన చట్టం కింద అనేక హామీలు అమలు చేశాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

దిల్లీ: భారాస, కాంగ్రెస్ నేతలు పోటీపడి మరీ ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని, ఓట్ల కోసం తప్ప ప్రజలకు నిధులు ఖర్చు చేయట్లేదని ఆరోపించారు.

సంక్షేమ పథకాల కోసం కేంద్రం రూ.6లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని భారాస, కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్న నేపథ్యంలో ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. "పునర్విభజన చట్టం కింద అనేక హామీలు అమలు చేశాం. రామగుండంలో విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశాం. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని శంకుస్థాపన చేశారు. గిరిజన వర్సిటీ కోసం కేంద్రం నిధులు మంజూరు చేసింది. జీఎస్టీ పరిహారం కింద రూ.7వేల కోట్లు అందజేశాం. జాతీయ రహదారుల కోసం రూ.1.10లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటికే రూ.వేల కోట్లతో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కోసం రూ.700 కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం రూ.1,248 కోట్లు కేటాయించింది"అని కిషన్‌రెడ్డి తెలిపారు.



## బీజేపీ 'అసెంబ్లీ' ఎజెండా ఫిక్స్..
## కాంగ్రెస్‌ను ఇరుకునపెట్టేలా ప్లాన్

అసెంబ్లీ సమావేశాలు వాడి వేడిగా జరుగుతున్న నేపథ్యంపై రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టేందుకు బీజేపీ సిద్ధమవుతున్నది. ముఖ్యంగా రైతులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని భావిస్తున్నది. రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగుల డిమాండ్లపై మాట్లాడేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేయనున్నారు.

**రుణమాఫీ నిబంధనలపై..** ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ అని చెప్పి.. ఇప్పుడు నిబంధనలు పెట్టడంపై హస్తం పార్టీని నిలదీయాలని బీజేపీ ఎమ్మెల్యేలు ఫిక్సయ్యారు. అంతేకాకుండా తమ నియోజకవర్గాలకు జరుగుతున్న అన్యాయంపైనా ప్రశ్నించాలని డిసైడయ్యారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్న సెగ్మెంట్ల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని, పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సైతం ఆహ్వానం అందడంలేదని గట్టిగా అడగాలని ప్లాన్ చేసుకున్నారు. అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న సెగ్మెంట్ల పరిధిలో కలెక్టర్లకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి తమ అధికారాలను కాలరాస్తున్నారని నిలదీయాలని చూస్తున్నారు.

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగుల పరిస్థితిని బీఆర్ఎస్ పట్టించుకున్న పాపాన పోలేదని, కాంగ్రెస్ కూడా అదే దారిలో పోతోందని తమ గళాన్ని వినిపించనున్నారు. ప్రశ్నించిన వారిని అణిచివేయాలని చూడటంపైనా వారు నిలదీయాలని నిర్ణయం తీసుకున్నారు.

**భేటీ అయిన బీజేపీ ఎమ్మెల్యేలు...** నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు.

పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై శాసన సభ్యులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పై పోరును మరింత ఉధృతం చేయాలని కమలం పార్టీ ఎమ్మెల్యేలు ఎజెండాను సిద్ధం చేసుకున్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.




# ఇంకా భ్రమల్లోనే ఉన్నారు

# ప్రజలు శిక్షించినా బీఆర్ఎస్ నేతలు మారట్లేదు

## అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : రెండో రోజు తెలంగాణ అసెంబ్లీ సమావే శాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. గత ప్రభుత్వంలో చాలా గ్రామాలకు తాగునీరు ఇవ్వలేదన్నారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆయన.. తండాలను పంచాయతీలుగా మార్చిన వసతులు కల్పించలేదన్నారు. చాలా తండాలకు రోడ్డు మార్గం లేదన్నారు. నిర్లక్ష్యానికి గురైన తండాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు రేవంత్. అన్ని మండలాలకు తాగునీరు, విద్యుత్ అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. తండాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. తండాలు,గూడాలు అభివృద్ధి చెందితేనే అసలైన అభివృద్ధి జరిగినట్టు అని అన్నారు. తప్పు చేశారని ప్రజలు తీర్పు ఇచ్చినా బీఆర్ఎస్ నేతలు మారడం లేదన్నారు. ఇంకా భ్రమల్లోనే బతుకుతున్నారని విమర్శించారు. జూలై 31 వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. జూలై 25న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

**కేసీఆర్‌ను రమ్మనండి.. దీక్షకు నేను సిద్ధం: సీఎం రేవంత్‌రెడ్డి :** రాష్ట్రానికి నిధుల కోసం దిల్లీలో దీక్ష చేయాలని భారాస ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు చేసిన డిమాండ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని రేవంత్ చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకురావాలన్నారు. మీరే తారీఖు డిసైడ్ చేయండి దీక్షకు మేం సిద్ధం. తెలంగాణకు నిధులు తెచ్చుడో..సచ్చుడో తేల్చుకుందామని సవాల్ విసిరారు. "చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని మేమెప్పుడూ పదే పదే చెప్పలేదు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ, అగ్గిపెట్టి కొనలేదు. అగ్గిపెట్టి మర్చిపోయినట్టు నటించి అమాయక విద్యార్థులను బలిగొనలేదు'' అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై శాసనసభలో చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పర విమర్శలతో సభ వేడెక్కింది.

# సంపాదకీయం

## బిహారీ బాబు నితీష్ ఏం చేయబోతున్నారో ?

బీజేపీ చెప్పాల్సింది చెప్పేసింది. ప్రత్యేక హోదా అన్నది ఇవ్వలేమని స్పష్టంగా తేల్చేసింది. 2012లోనే బీహార్ కి ఆ హోదా దక్కించుకునేందుకు అవకాశం లేదని చెప్పిన ఒక నివేదికను కూడా గుర్తు చేసింది. దాంతో ప్రత్యేక హోదావే తమకు కావాలని పట్టుబట్టి కూర్చున్న జేడీయూ ఇపుడు ఏమి చేయబోతోంది అన్నది పెద్ద ప్రశ్నగా ముందుకు వస్తోంది. బీఎహార్ సీఎం జేడీయూ అధినేత నితీష్ కుమార్ మార్క్ పాలిటిక్స్ అందరికీ తెలిసిందే. ఆయన సడెన్ గా డెసిషన్స్ తీసుకుంటారు అని గత రెండు దశాబ్దాల రాజకీయం చూస్తే అర్ధం అవుతుంది. ఆయన ప్రస్తుతం బీహార్ సీఎం గా ఉన్న నాలుగేళ్ళ పదవీ కాలంలోనే మూడుసార్లు కూటములను మార్చారు. ఇక జీవితకాలం అంతా ఎన్డీయేతో ఉంటాను అని ఆయన ఆ మధ్య పదే పదే చెప్పారు. అయితే ఇవన్నీ రాజకీయాలు దాంతో ఎపుడేమి జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఎవరి రాజకీయ ప్రయోజనలకు అనుగుణంగా వారు పావులు కదుపుతారు. నితీష్ చేతిలోకే తిరిగి బంతి చేరినట్లు అయింది. నిజానికి బీహార్ కి ప్రత్యేక హోదా అన్నది పాత డిమాండే అయినా దానికి బూజు దులిపింది నితీష్ కుమార్ జేడీయూ. ఎందుకంటే రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిచి బీహార్ పీఠం అధిష్టించాలి అన్నది ఒక లెక్క అయితే కేంద్రంలో బీజేపీ వద్ద తన పలుకుబడిని టెస్ట్ చేసుకోవాలన్న ఆరాటం మరొకటి. అంతేకాదు జాతీయ స్థాయిలో ఉన్న రాజకీయ పరిణామాలలో ఇండియా కూటమి ఆ వైపున ఉంది. నితీష్ కుమార్ కి అది కూడా ఆప్షన్ గా ఉన్నా ఆశ్చర్యం లేదు అని అంటున్నారు. ఏడు పదుల వయసులో ఉన్న నితీష్ బీహార్ కి సుదీర్ఘ కాలం సీఎం గా ఉన్నారు ఈ టెర్మ్ పూర్తి అయితే ఆయన ఏకంగా రెండు దశాబ్దాల పాటు నిరాటంకంగా సీఎం గా చేసిన రికార్డుని సొంతం చేసుకుంటారు. దాంతో పాటు రాజకీయ జీవిత చరమాంకంలో ఆయన పదోన్నతిని కూడా కోరుకుంటున్నారు అని అంటున్నారు. ఉప ప్రధానిగా అయినా తన రాజకీయాన్ని చూపించి పదవీ విరమణ చేయాలన్నది ఆయన ఆలోచన అని చెబుతున్నారు. ఇలా అనేక రకాలైన వ్యూహాలతోనే ఆయన ప్రత్యేక హోదాను ముందుకు తెచ్చారు. అయితే కేంద్రం అది కాదు అని తోసిపుచ్చింది. కేంద్రం తీసుకున్న నిర్ణయమూ కరెక్టే అని అంటున్నారు. బీహార్ కి హోదా ఇస్తే తేనే తుట్టెను కదిపినట్లే అని కూడా అంటున్నారు. హోదా కోసం ఏపీ ఒడిషా రెండూ సిద్ధంగా ఉన్నాయి. దాంతో పాటుగా మరిన్ని రాష్ట్రాలు క్యూ కట్టే పరిస్థితి ఉంది. దాంతో అర డజన్ దాకా స్టేట్స్ కొత్తగా స్పెషల్ స్టేటస్ కోరితే కేంద్ర బడ్జెట్ కూడా చూసుకోవాలి కదా అన్న చర్చ సైతం ఉంది. దాంతో బీజేపీ ఆదిలోనే ఈ డిమాండ్లకు అడ్డుకట్ట వేసింది అని అంటున్నారు. మరి బీహార్ కి కేంద్రం ఏమి చేయబోతోంది అన్నది కూడా ఉంది. ప్రత్యేక ప్యాకేజీ అయినా ఇవ్వాలని మరో ఆల్టర్నేషన్ కూడా జేడీయూ చూపించింది. అది కూడా లక్షా పాతిక వేల కోట్ల రూపాయల దాకా ప్యాకేజీ అని అంటోంది. అంత సొమ్ము కేంద్రం ఇస్తుందా లేక విడదల వారీగా సాయం చేస్తామని చెబుతుందా అన్నది చూడాలి. బీహార్ కి ఎన్నికల వేళ హోదా కాదు ప్యాకేజీ అంటూ ఏదో ఒకటి చేయవచ్చు అని కూడా అంటున్నారు. కేంద్రం ఆలోచనలు ఇలా ఉంటే జేడీయూ దీంతో సంతృప్తి పడుతుందా లేక ఎర జెండా ఎగరేస్తుందా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఎర్ర జెండా ఎగరేస్తే అపుడు కేంద్రంలో ఎన్డీయే కూటమి పరిస్థితి ఏంటి అన్నది మరో చర్చగా ఉంది. బీహార్ లో మొత్తం 17 మంది ఎన్డీయే మిత్రులు గెలిచారు. ఇందులో జేడీయూ వాటా 12 మంది ఎంపీలు ఆ మిగిలిన అయిదుగురిలో ముగ్గురు చిరాగ్ పాశ్వాన్ పార్టీ లోక్ జనశక్తికి అయిదుగురు ఎంపీలు, కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నాయకత్వంలోని హిందుస్థానీ అవామ్ మోర్చా పార్టీకి ఒక ఎంపీ ఉన్నారు. బీజేపీకి 12 మంది ఎంపీలు ఉన్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని తీసుకుని నితీష్ కుమార్ ఎన్డీయే కి గుడ్ బై చెబితే ఆయన వెంట ఎవరు నడుస్తారు అన్న చర్చ ఉంది. ఇప్పటికే కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ ప్రత్యేక హోదా ఎవరికీ ఇచ్చేది లేదని చెప్పి నితీష్ కుమార్ కి ఝలక్ ఇచ్చారు. ఆయన నితీష్ కుమార్ ని వ్యతిరేకిస్తారు. చిరాగ్ పాశ్వాన్ సైతం ఎదుగుతున్న యువ నాయకుడు. ఏనాటికైనా సీఎం కావాలని ఆయనకు కోరిక ఉంది. నితీష్ కుమార్ తో పాటు ఆయన ప్రత్యేక హోదా గళం వినిపించినా ఎన్డీయేని వీడి ఆయన బయటకు వెళ్ళరని అంటున్నారు. అలా చూస్తే కనుక నితీష్ కుమార్ కి చెందిన 12 మంది ఎంపీలు ఎన్డీయేకు దూరం అయితే కేంద్రంలో ఎన్డీయే బలం 294 నుంచి 282కి పడిపోతుంది. అయినా మ్యాజిక్ ఫిగర్ కంటే తొమ్మిది మంది ఎంపీల ఆధిక్యత ఎన్డీయేకు ఉంటుంది. దానికి తోడు వైసీపీకి చెందిన నలుగురు ఎంపీలు క్లిష్ట సమయంలో ఎలాగూ మద్దతు ఇస్తారు అన్న నమ్మకం సైతం ఉంది. ఇంకా చిన్నా చితకా పార్టీల మద్దతుని కూడా కూడగట్టవచ్చు. ఏది ఏమైనా నితీష్ కుమార్ డిమాండ్ కి తలొగ్గకూడదు అనే బీజేపీ నిర్ణయించుకుంది అని అంటున్నారు. బీహార్ లో బీజేపీ జేడీయూ కలిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో విజయావకాశాలు ఉంటాయి. విడిపోతే నష్టం వస్తుంది కానీ ప్రత్యేక హోదా వంటి వాటి విషయంలో మాత్రం కేంద్రం తన స్టాండ్ కి కట్టుబడాలని భావిస్తోంది అని అంటున్నారు. ఈ లెక్కలు అన్నీ తెలిసిన రాజకీయ ఉద్దండుడు నితీష్ కుమార్ ఎన్డీఏకు గుడ్ బై చెబుతారా అన్నదే ఒక పెద్ద ప్రశ్న.

# రత్నాలయంలో పంచలోహ విగ్రహాలు, వెండి చోరీ....

### క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో దొంగల ఆడవాళ్ల కోసం తనిఖీలు...

### దొంగలను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలు...





శామీర్‌పేట, (గరుడ వార్త) : అలియాబాద్ గ్రామ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయమైన రత్నాలయంలో భారీ ఎత్తున చోరీ జరిగింది. బుధవారం శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల అనుసారం... అలియాబాద్ చౌరస్తా సమీపంలోనున్న రత్నాలయంలోకి మంగళవారం రాత్రి ప్రధాన ఆలయం వెనకనున్న ఇనుప గ్రిల్ నుండి ప్రవేశించి తలుపు తాళాలు విరగ్గొట్టి గుడిలోకి దొంగలు ప్రవేశించినట్లుగా పెట్ బషీరాబాద్ ఏసిపి రాములు, శామీర్పేట పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనాథ్ తెలిపారు. ఆలయంలోని బంగారు ఆభరణాలు, వెండి, పంచలోహ ఆభరణాలు దొంగిలించారన్నారు. 4.5 తులాల శ్రీ వెంకటేశ్వర స్వామి మెడలోని లక్ష్మి అమ్మవారి లాకెట్, 1 వెండి ఖడ్గం దాదాపు మూడు కిలోలు, సుమారు ఒక కిలో విలువచేసే 2 వెండి శతగోపంలు, 700 గ్రాముల వెండి దండకం ఒకటి, 50 గ్రాముల వెండి యజ్ఞోపవితం ఒకటి, 1.551 కేజీల భోగ శ్రీనివాసమూర్తి వెండి విగ్రహం, సుమారు 3.770 కిలోల వెండి సత్యనారాయణ స్వామి విగ్రహం, 820 గ్రాముల వెండి కిరీటాలు, 1.8 కేజీల వెండి వడ్డానం ఒకటి, 600 గ్రాముల రెండు వెండి నాగపడిగేలు, 55 కేజీల శ్రీదేవి, భూదేవి, శ్రీనివాస ఉత్సవ మూర్తులు నాలుగు రెండు ఫీట్ల పంచలోహ విగ్రహాలు, 5 కేజీల పంచలోహ సుదర్శన చక్రం ఒకటి దొంగలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ఈ చోరీలో పదితులాల బంగారు ఆభరణాలు, 13.5 కేజీల వెండి ఆభరణాలు, 60 కేజీల పంచలోహ విగ్రహాలు గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తలస్తోంది. పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తో కలిసి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి వెంటనే క్లూస్ టీం బృందంతోపాటు, డాగ్ స్క్వాడ్ ని రప్పించి దొంగల ఆనవాళ్ళ కోసం గాలించారు. లా అండ్ ఆర్డర్, క్రైమ్స్ సిసిఎస్, ఎస్ఓటి అధికారులతో 5 బృందాలుగా ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. దొంగలు తమ ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్త పడడంతో, రత్నాలయంలో దొంగతనం చేసిన దొంగలు గతంలో సైతం పలు దొంగతనాలకు సైతం పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వీలైనంత త్వరగా పట్టుకునేందుకు పోలీస్ సిబ్బంది ప్రత్యేకమైన దృష్టి సారించింది.

# భారీగా నిషేధిత మెడికల్ డ్రగ్స్ పట్టి వేత

### టాస్క్ ఫోర్స్, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సంయుక్తంగా దాడులు

### సుమారు రూ.6 కోట్ల సరుకు సీజ్



శామీర్‌పేట, (గరుడ వార్త) : మేడ్చల్ జిల్లా మూడు చింతపల్లి మండలంలో భారీగా నిషేధిత మెడికల్ డ్రగ్స్ మాఫియా గుట్టును అధికారులు రట్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ మాఫియాను అంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృతనిశ్చయంతో ముందుకు వెళ్తుంది. మంగళవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఎస్‌వోటీ పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్ పట్టుకున్నారు. మూడు చింతలపల్లి మండల పరిధిలోని పోతారం చౌరస్తాలో ఓ అద్దె ఇంట్లో ఆస్ ప్రో బయో డ్రగ్స్ నిల్వ ఉంచారనే సమాచారం మేరకు ఆ గోడౌన్‌పై టాస్క్‌ఫోర్స్, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మెరుపు దాడి చేశారు. అక్కడ అక్రమంగా నిలువ ఉంచిన 60 రకాల రూ.96 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను వారు గుర్తించారు. దాడుల్లో డిప్రెషన్ కంట్రోల్, యూరిన్ కంట్రోల్‌తో పాటు పలు రకాలకు తయారు చేసే మెడిసిన్‌లను కొరియర్ ద్వారా ఇతర రాష్ట్రాలకు సప్లై చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఓపెన్ మార్కెట్ లో ఆ డ్రగ్స్ విలువ సుమారు రూ.6 కోట్లు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. డ్రగ్స్ నిలువ చేసిన గోడౌన్ ప్రాంతం ఆస్పిన్ బయో ఫార్మాకు చెందినదిగా పేర్కొన్నారు. కడారి సతీష్‌రెడ్డి పేరుతో ఆ గోడౌన్ ఉన్నట్లుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కాగా అతడిపై గతంలో కేసులు నమోదైనట్లుగా అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం...




శామీర్‌పేట, (గరుడ వార్త) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ యూఎస్ఏ ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు. బుధవారం తుంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయంజాల్ ప్రభుత్వ పాఠశాలలో కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ యూఎస్ఏ ఆధ్వర్యంలో డాక్టర్ వినోద్ కుకునూర్, డాక్టర్ కవిత, కీర్తిశేషులు బ్రహ్మశ్రీ కుక్కునూరు కాళిదాస్ స్మారకార్థం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మర్చి 2024 పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన మొదటి, ద్వితీయ, తృతీయ స్థానములలో నిలచిన తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు మొదటి బహుమతి రూ. 20వేలు, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు, తృతీయ బహుమతి కింద నగదు పురస్కారము తో పాటు ప్రశంసా పత్రము, మెమెంటో అందజేసి విద్యార్థులను అభినందించారు. పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. విద్యార్థులకు చదువులలో ప్రోత్సాహాన్ని అందిస్తానని, ఉత్తమ ప్రతిభ కనబరిచి తనలాగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు బాగా కష్టపడి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పేరును నిలబెట్టాలని, దేశంలో ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. వినోద్ కుక్కునూరు ఈ పాఠశాలలో 9వ తరగతి వరకు చదివి విదేశాలలో ఉన్నత స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థిగా తనను తాను విద్యార్థులకు పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బాలేష , అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మీనా, వినోద్ కుక్కునూరు, సోదరులు అశోక్ కుక్కునూరు, రమాదేవి కుక్కునూరు, డాక్టర్ శాంతి, కృష్ణ, ఆచార్య, ఫౌండేషన్ నిర్వాహకులు ఫయాజ్, స్థానికులు నర్సింగ్ రావు, మహిపాల్ రెడ్డి, సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు సమస్యకు పరిష్కారమెన్నడో!

గోదావరిఖని: చినుకుపడిందంటే చాలు...గోదావరిఖనిలోని 2, 5 ఇన్‌క్లయిన్ వంతెనలోంచి రాకపోకలు నిలిచిపోవాల్సిందే... కళ్యాన్‌నగర్‌లోని ఉల్లిగడ్డల బజారు, లెనిన్ నగర్, శివాజీనగర్, రామగుండంలోని అంగడి బజారు ప్రాంతాలు ముంపునకు గురి కావాల్సిందే. గోదావరినది బ్యాక్ వాటర్‌తో శ్రీనగర్ కాలనీ, సప్తగిరి కాలనీ ప్రాంతాల ప్రజలు ఇళ్లు వదిలిపెట్టి పోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. బి.ఎస్.ఎన్.ఎల్. క్వార్టర్లలోని వరద నీరు బయటకు వెళ్లేందుకు భూగర్భ మురుగు కాలువ నిర్వహణ లేకపోవడంతో నీరు ఇళ్లల్లోకి చేరుతుంది. రెండేళ్ల క్రితం భారీ వర్షాల కారణంగా వరదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు మళ్లీ వర్షాకాలం వస్తుందంటే బెంబేలెత్తుతున్నారు.

**చినుకు పడిందంటే మునకే...** విఠల్‌నగర్, తిలక్‌నగర్, రమేశ్‌నగర్, జవహర్‌నగర్‌లోని కొంత భాగానికి చెందిన కాలనీలతో పాటు సంజయ్‌నగర్, జ్యోతినగర్, రాంనగర్ తదితర ప్రాంతాల నుంచి వరద, మురుగు నీరంతా వంతెన కిందనుంచి బయటకు వెళ్లాల్సిందే. వర్షం కురిస్తే మూడు ప్రధాన మురుగు కాలువలు నిండుగా ప్రవహిస్తుండగా వంతెన కిందనున్న కాలువ చిన్నదిగా ఉండటంతో వరద నీరు రోడ్డుపై నిలుస్తోంది. చిన్నపాటి వర్షమైనా రాకపోకలు నిలిచిపోవాల్సిందే. ఈ సమస్య పరిష్కారం కోసం పుష్కరకాలం క్రితం అప్పటి ప్రజాప్రతినిధులు సింగరేణి సహకారంతో అంచనాలు సిద్ధం చేసినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు.

**ఇరుకైన వంతెనతో ఇక్కట్లు** కాకతీయనగర్, మేదరిబస్తీ, కళ్యాన్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, లెనిన్‌నగర్, శివాజీనగర్, రాంనగర్, మల్లికార్జున్‌నగర్, సీతానగర్ తదితర ప్రాంతాల్లోంచి వరదనీరంతా గోదావరిఖనిలో ని 2 ఇన్‌క్లయిన్ వంతెన కింది నుంచే బయటికి వెళ్లి జనగామ చెరువులో కలవాలి. ఆయా కాలనీల్లోంచి వరద, మురుగు నీరు ప్రవహించే రెండు ప్రధాన మురుగు కాలువల సామర్థ్యం సరిపోకపోవడంతో వరదంతా వంతెన కింద రోడ్డుపై పారుతోంది. దీంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు.

ఇలా చేస్తేనే ప్రయోజనం

సుమారు రెండు దశాబ్దాల క్రితం సింగరేణి యాజమాన్యం తీసుకున్న నిర్ణయంతో బాపూజీనగర్, జీఎం కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోని వరద నీరు ప్రవహించే 2ఎ ఇన్‌క్లయిన్ వంతెన వద్ద ముంపు సమస్య పరిష్కారమైంది. ఇక్కడ చేసినట్లుగానే 2, 5 ఇన్‌క్లయిన్ వంతెనల వద్ద కూడా చేపట్టినట్లయితే ఆయా ప్రాంతాల్లో వరద ముంపు సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. సింగరేణి కార్మికులంతా ఈ వంతెన నుంచే గనుల్లో విధుల్లోకి వెళ్తుండటంతో వర్షాకాలంలో కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించిన సింగరేణి యాజమాన్యం రూ.7 లక్షల వ్యయంతో చర్యలు తీసుకుంది. వంతెన కింద మొత్తం వెడల్పులో మురుగు కాలువ నిర్మించి ఇటువైపు వచ్చే రెండు ప్రధాన మురుగు కాలువలను వంతెన కిందఉన్న కాలువకు అనుసంధానం చేశారు.

మురుగు తొలగింపునకు చర్యలు

రామగుండం నగరపాలక ప్రాంతంలోని ప్రధాన మురుగు కాలువల్లో సిల్టు తొలగింపు పనులు చేపడుతున్నాం. వీలైన చోట జేసీబీ యంత్రాలతో, వీలు కాని చోట కార్మికులతో మురుగు, పూడికతీత పనులు చేపడుతున్నాం. వర్షాకాలంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం, పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, స్థానిక పరిశ్రమల సమన్వయంతో నగరంలో వరద ముంపు సమస్య పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. సీహెచ్.శ్రీకాంత్, కమిషనర్, రామగుండం కార్పొరేషన్

# వనమహోత్సవానికి వేళాయె..!

సూర్యాపేట : అడవుల శాతం పెంపులో భాగంగా గత రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఖాళీ, ప్రభుత్వ స్థలాల్లో, రహదారులకు ఇరువైపులా, పలు ప్రాంతాల్లో వానాకాలం ఆరంభంలో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టింది. వాటి సంరక్షణకు ప్రభుత్వమే బాధ్యత వహించింది. దీంతో ఆదిలో నాటిన మొక్కలు ఇప్పుడు మహావృక్షాలుగా ఎదిగాయి. గత ప్రభుత్వం ఎనిమిది విడతలుగా ఈ కార్యక్రమం చేపట్టగా.. ప్రస్తుతం అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారాన్ని వన మహోత్సవంగా మార్చి మొదటి విడతగా అమలు చేయనుంది. ఈ కార్యక్రమానికి మార్పులు తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ఎక్కడ ఎన్ని, ఏ రకం మొక్కలు నాటాలి, పూలు, పండ్లు, తదితర మొక్కలకు ప్రాధాన్యం ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

లక్ష్యాల విధింపు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.11 కోట్ల మొక్కలు నాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం విధించింది. పర్యావరణ, అటవీ, పంచాయతీ రాజ్, రహదారులు, నీటి పారుదల, వ్యవసాయ, రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విద్య, పశు సంవర్ధక, గనులు, వైద్యారోగ్య, సాంఘిక



సంక్షేమ తదితర శాఖలకు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించి ఒక్కో శాఖకు ఒక్కో లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆ ప్రకారం నాటేందుకు మొక్కలను సిద్ధం చేసుకోవడంతో పాటు, స్థలాల గుర్తింపు పనిలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలో ఈ కార్యక్రమం మొదలు కానుండటంతో అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల అనంతరం కోడ్ ముగియగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. కింది స్థాయి నుంచి జిల్లా అధికారులు, రాజకీయ నాయకుల సమన్వయంతో వన మహోత్సవం విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

76.24 లక్షల మొక్కలు సిద్ధం

గత ప్రభుత్వ పాలనలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలతో పాటు, మున్సిపాలిటీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల పూలు, పండ్లు, తదితర మొక్కలను పెంచడానికి ఏర్పాట్లు చేసింది. ఈ వానాకాలంలో మొక్కలు నాటడానికి మూడు, నాలుగు నెలల నుంచే పెంపకం పనులు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా నర్సరీల్లో సుమారు 76.24 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచారు. ఈ సారి వర్షాలు విస్తారంగా కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచన మేరకు ముందస్తుగానే మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించారు.

కార్యాచరణ రూపొందించాం– సతీష్, జిల్లా అటవీ శాఖాధికారి, సూర్యాపేట వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఆయా శాఖలకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. శాఖల వారీగా నాటాల్సిన మొక్కల లక్ష్యాలను వారికి తెలియజేశాం. త్వరలో మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందించాం.

# కౌలుదారుల్లో ఆశల చిగురింత

ఆలేరు : తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన ప్రకటనతో కౌలు రైతుల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ముఖ్యంగా రాష్ట్రంలో సాగవుతున్న భూముల్లో 30 నుంచి 40 శాతం వ్యవసాయ భూములు కౌలు (చిన్న, సన్నకారు) రైతుల చేతుల్లో ఉన్నాయని ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. సాగు పరంగా కౌలు రైతుల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాల నుంచి వారికి ఏ విధంగానూ సాయం అందడం లేదన్నది వాస్తవం. ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ఎజెండాలోనూ కౌలు రైతులకు ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కౌలు రైతులపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఇటీవల సూత్రప్రాయంగా వెల్లడించారు. భూములను కౌలుకు తీసుకున్న రైతులు భూ యజమానుల నుంచి అఫిడవిట్లు తీసుకుంటే వారికి రైతు భరోసాను అందిస్తామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 9,48,810 మంది రైతులకు గానూ 2.95లక్షల మంది కౌలు రైతులున్నట్లు ఒక అంచనా. ఏటా పెరుగుతున్న కౌలుదారులు

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2011లో కౌలు రైతులను గుర్తించి వారికి చేయూత అందించడానికి కొంత ప్రయత్నం జరిగింది. అదే ఏడాదిలో ప్రభుత్వం దరఖాస్తులను సైతం ఆహ్వానించింది. ఈ క్రమంలోనే కౌలు గుర్తింపుపై పట్టాదారు రైతుల నుంచి తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది. అనంతరం భారాస అధికారంలోకి వచ్చాక అటువైపు దృష్టిసారించలేదు. బడా భూస్వాములు, ఇతర ప్రాంతాల్లో



వృత్తి, వ్యాపార పరంగా స్థిరనివాసం ఉన్నవారు తమ పొలాలను పడావు పెట్టకుండా కౌలుకు ఇస్తున్నారు. దీంతో ఏటా కౌలుదార్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో వేల సంఖ్యలో కౌలు రైతులున్నప్పటికీ వారికి ఏవిధమైన సాయం అందడంలేదు. వ్యవసాయ శాఖ మంత్రి ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడించడంతో కౌలుదారుల్లో ఓ పక్క ఆనందం వ్యక్తం అవుతున్నా మరోపక్క సంశయం నెలకొంది. ముఖ్యంగా ఆసాములు అఫిడవిట్లు ఇస్తారా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కౌలుదార్లు మొత్తంగా చిన్న, సన్నకారు రైతులే ఉంటున్నందున ప్రభుత్వ పరంగా ఎకరాకు రూ.7500 చొప్పున రెండు సీజన్‌లకు కలిపి రూ.15వేలు అందే అవకాశం ఉంది. కానీ, అఫిడవిట్లు కథతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రాధాన్యం కల్పించాలి– బత్తిని సత్యనారాయణ, కౌలురైతు, చల్లూరురాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంటే కౌలు రైతులకు మేలు జరుగుతుంది. గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న కౌలుదారులకు గుర్తింపు కార్డులు సైతం ఇచ్చారు. పెట్టుబడి పెట్టినప్పటికీ ప్రకృతి వైపరీత్యాల కారణంగా కౌలురైతులం అనేక రకాలుగా నష్టపోతున్నాం. అనేక కష్టనష్టాలకు ఓర్చి పంటలు పండిస్తున్న మాకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించాలి.

# పుష్కరానంతరం.. సమూలాల ప్రక్షాళన

ఖమ్మం : స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖను రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఉద్యోగుల బదిలీలతో పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేశారు. 40 శాతం ఉద్యోగులను బదిలీ చేయాలనే నిబంధనను పక్కనపెట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు(అటెండర్లు) మొత్తాన్ని వేరే స్థానాలకు బదిలీ చేశారు. ఎలాంటి పైరవీలు, రాజకీయ ఒత్తిళ్లకు తావీయకుండా ఆ శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రసాద్ జోనల్ పరిధిలో సీనియర్ సహాయకులను బదిలీ చేశారు. జూనియర్ సహాయకులు, అటెండర్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అనుమతితో జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ బదిలీ చేశారు. 13 ఏళ్లుగా ఈ శాఖలో బదిలీలు చేయకపోవడంతో ఒకేసారి అందరినీ బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు అందించి మూడు రోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా




లు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న 13 మంది సీనియర్ అసిస్టెంట్లను ఉమ్మడి వరంగల్ జిల్లాకు బదిలీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేస్తున్న 13 మంది సీనియర్ అసిస్టెంట్లకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోస్టింగ్ కల్పించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేస్తున్న జిల్లాస్థాయిలోని 30 మంది జూనియర్ అసిస్టెంట్లను, 12 మంది అటెండర్లను వారు పని చేస్తున్న స్థానాల నుంచి తప్పించారు. ఉమ్మడి జిల్లాలోనే ఇతర ప్రాంతాల్లో వారికి పోస్టింగ్‌లు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రమే షరాఫ్(క్యాషియర్) ఒకే పోస్టు ఉండగా అందులో పని చేస్తున్న ఉద్యోగి బదిలీ నుంచి తప్పించుకున్నారు.

ఒకే స్థానంలో రెండేళ్ల కాలం పూర్తి చేసిన సబ్ రిజిస్ట్రార్లు మరో మూడు, నాలుగు రోజుల్లో బదిలీ కానున్నారు.

**రవాణాశాఖలో..** ఖమ్మం జిల్లా రవాణాశాఖలో శనివారం అర్ధరాత్రి బదిలీలు చేపట్టారు. ఒక ఇన్‌స్పెక్టర్‌తో పాటు ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు బదిలీలు అయ్యాయి. ఖమ్మం జిల్లా కల్లూరు చెక్‌పోస్టులో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఆర్.విజయలక్ష్మీని మెదక్ జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. ఖమ్మంలో సీనియర్ అసిస్టెంట్ హెచ్.సంతోష్‌కుమార్‌ను మహబూబాబాద్ బదిలీ చేయగా అక్కడి సీనియర్ అసిస్టెంట్ కె.రవీందర్ ఖమ్మానికి రానున్నారు. వైరా ఆర్టీఏ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కె.రాజశేఖర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రవాణాశాఖ కార్యాలయానికి బదిలీ చేయగా.. అక్కడి సీనియర్ అసిస్టెంట్ బి.ఉషారాణి వైరాకు రానున్నారు. ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో తక్షణమే రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

## యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా

శంకరపట్నం: జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట వేసే వారే కరవయ్యారు. యథేచ్ఛగా పీడీఎస్ బియ్యంతో నిందితులు పట్టుబడుతున్నా రవాణా ఆగడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సుమారు 20 కుటుంబాలు శంకరపట్నం మండలం వంకాయగూడెం, తాడికల్ గ్రామాల్లో నివాసం ఏర్పరుచుకున్నాయి. సదరు కుటుంబాలు ఆటోల్లో తిరుగుతూ అల్లం, ఉల్లిగడ్డలు ఇతర సరకుల అమ్మకాల పేరిట గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలుకు తెరలేపుతున్నారు. శంకరపట్నం, సైదాపూర్, వీణవంక మండలాల్లో నెలనెలా తిరుగుతూ కిలోకు రూ.10 నుంచి రూ.12 చొప్పున బియ్యం కొంటున్నారు. ఆయా మండలాల్లో రేషన్ దుకాణాల ఎదుట లబ్ధిదారుల నుంచి నేరుగా కొనుగోలు చేసి తరలిస్తున్నారంటే ఈ దందా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

కొన్న రేషన్ బియ్యం సిద్దిపేట, కామారెడ్డి ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు రాత్రి వేళల్లో తరలించి కిలోకు రూ.15 నుంచి రూ.25 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. కొందరు రాజకీయ నాయకుల అండతో పోలీసులకు చిక్కకుండా బియ్యం రవాణా జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే మండలానికి చెందిన పలువురు రేషన్ బియ్యాన్ని స్థానిక రైస్‌మిల్లుల్లో విక్రయిస్తున్నా సివిల్ సప్లై అధికారులు దాడులు చేసిన దాఖలాలు లేవు. ఈ నెల 4న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వంకాయగూడెంలో ఇళ్లలో నిల్వ ఉంచిన సుమారు 45 క్వింటాళ్లు.. 13న స్థానిక పోలీసులు కేశవపట్నం వద్ద మూడు ఆటోల్లో తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. కేసులు నమోదు చేసినా అక్రమ వ్యాపారుల తీరు మారటం లేదు. దీన్ని అరికట్టి ప్రజాధనం వృథాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## బీమా.. రైతు కుటుంబానికి ధీమా

ఖమ్మం : 'రైతు బీమా' పథకానికి అర్హులైన రైతుల నుంచి జిల్లా వ్యవసాయ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. 2024 సంవత్సరానికి సంబంధించిన మార్గదర్శకాలను శనివారం విడుదల చేసింది. నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పొందిన రైతులు ఈ పథకంలో పేరు నమోదు చేసుకునేందుకు అర్హులు. వీరంతా ఆగస్టు 5వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**అందజేయాల్సిన వివరాలు...**

రైతుబీమా దరఖాస్తు ఫాం, రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారు పాసు పుస్తకాల నకళ్లు, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు పత్రాల నకళ్లు.

అర్హతలు వీరే.. 28.6.2024 లోపు ధరణి పోర్టల్ ద్వారా ధ్రువీకరించిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకం, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా పొందినవారు. వయసు ఆధార్ యూఐడీఏఐ పోర్టల్‌ను అనుసరించి 18-59 సంవత్సరాల మధ్య ఉన్నవారు. అంటే 14.8.1965 నుంచి 14.8.2006 మధ్య జన్మించి ఉండాలి వయసును ఆధార్ కార్డు వివరాల ఆధారంగా మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

# కాజేసిన సొమ్మునే దోచేసి



హైదరాబాద్: కాయకష్టం చేయకుండా కేవలం ఫోన్‌కాల్‌తో రూ.కోట్లు కొట్టేస్తున్నారు. కాజేసిన సొమ్మును క్షణాల్లో పలు బ్యాంకు ఖాతాల్లోకి మార్చి పోలీసులను ఏమార్చుతున్నారు. సైబర్ కేటుగాళ్ల ఆట కట్టించేందుకు పోలీసులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సామాన్యుల కష్టార్జితం కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది గ్రేటర్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో సుమారు రూ.50-60 కోట్ల మేర రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. అలాంటి సైబర్ ఠాణాల్లోని కొందరు పోలీసులు కాసుల కక్కుర్తితో మాయగాళ్లకు సహకరిస్తున్నారు. ఎంతో శ్రమకోర్చి బ్యాంకు ఖాతాల్లో స్తంభింపజేసిన చేసిన సొమ్మును తిరిగి కేటుగాళ్లకు చేరేందుకు అడ్డదారిలో తోడ్పాటును అందిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తమకున్న వెసులుబాటును ఉపయోగించుకొని కొందరు ఇన్‌స్పెక్టర్లు కమీషన్ రూపంలో రూ.లక్షలు స్వాహా చేసినట్టు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. గతంలో నగర సైబర్ క్రైమ్ విభాగంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్సైలపై ఉన్నతాధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

**హవాలా వ్యాపారులతో అంటకాగి**

క్రెడిట్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు, రుణయాప్‌లు, సర్వీస్ సెంటర్లు, విద్యుత్‌బిల్లులు, ఖరీదైన బహుమతులు వీటిని అస్త్రాలుగా వాడుకొని సైబర్ నేరస్థులు రూ.కోట్లు కొల్లగొట్టి నిమిషాల వ్యవధిలో 10-12 ఖాతాలకు మళ్లిస్తున్నారు. బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీగా మార్చి విదేశాలకు చేరవేస్తున్నారు. ఇందుకు హవాలా వ్యాపారులు సహకరిస్తున్నారు. పోలీసులు నిందితుల ఖాతాలను స్తంభింపజేసినప్పుడు ఈ హవాలా ముఠాలు రంగంలోకి దిగుతున్నాయి. నగరానికి వచ్చి దర్యాప్తు అధికారులను సంప్రదిస్తున్నారు. 10-20 శాతం కమీషన్ ఇస్తామనగానే అధికారులు వారితో చేతులు కలుపుతున్నారు. ఇటీవల ఇది సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చింది. అలా కక్కుర్తి పడిన అధికారులు బదిలీపై వెళ్లారు.

**ఎవరు వారు.. ఎంత తిన్నారు**

సైబర్‌క్రైమ్ ఠాణాలో పనిచేసిన ఒక ఇన్‌స్పెక్టర్ దర్యాప్తులో భాగంగా వివిధ రాష్ట్రాలకు వెళ్లారు. అక్కడ నిందితుల తరపు న్యాయవాదులతో మంతనాలు జరిపి తన వాటా తీసుకునేవాడనే ఆరోపణలున్నాయి.

గతేడాది ఒక ఇన్‌స్పెక్టర్ ఉత్తరాదికి చెందిన ఒక హవాలా వ్యాపారితో చేతులు కలిపి వనస్థలిపురంలోని లాడ్జీలో మంతనాలు జరిపినట్టు సమాచారం. మరో కేసులో బంజారాహిల్స్‌లోని ఒక బేకరీలో హవాలా వ్యాపారి నుంచి ఒక ఇన్‌స్పెక్టర్‌కు రూ.69 లక్షలు అందినట్టు తెలుస్తోంది. ఏపీకి చెందిన హవాలా రాకెట్ సూత్రధారికి సహకరించి ఖరీదైన బహుమతి తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి.

రూ.2-3 కోట్ల లావాదేవీలు నిర్వహించే హవాలా వ్యాపారికి లాభం చేకూరేలా ఒక ఎస్సై మధ్యవర్తిగా వ్యవహరించినట్టు సమాచారం.

లావాదేవీలకు ఒకే మెయిల్ ఐడీ

శివమారుతి, ఏసీపీ, నగర సైబర్‌క్రైమ్

నిందితుల ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయటం దర్యాప్తు అధికారి చేతుల్లో ఉండదు. గతంలో దర్యాప్తు అధికారుల వ్యక్తిగత మెయిల్ నుంచి ఫ్రీజ్ చేయమని సమాచారమిచ్చేవారు. ఇప్పుడు అందరికీ ఒకే మెయిల్ ఐడీ ఉపయోగించాలనే నిబంధన అమలు చేస్తున్నాం. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ తదితర విభాగాల అమోదం పొందాకే ఖాతాల పునరుద్ధరణ జరుగుతుంది.

# మత్తు వీడేలా చదువుకునేలా..



హైదరాబాద్ : 'చదువులో ఒత్తిడి.. జీవితంలో స్థిరపడగలమా అనే ఆందోళనల నుంచి బయటపడేందుకు అప్పుడప్పుడు వీడ్ తీసుకుంటున్నాం. అదీ మిత్రుడి ద్వారా అలవాటైంది. తప్పని తెలిసినా మరో మార్గం లేక మత్తు ద్వారా ఒత్తిడిని అధిగమిస్తున్నాం. ఈ ఒక్కసారికి మన్నించండి. మరోసారి ఇటువంటి తప్పిదానికి పాల్పడం". ప్రభుత్వ వైద్యకళాశాలలోని ఇద్దరు జూనియర్ డాక్టర్ల అభ్యర్థన.

'మా క్యాంపస్‌లో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించవు. అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న మా సంస్థపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. హాస్టల్స్‌లో వార్డెన్‌లు చాలా అప్రమత్తంగా ఉంటారు. ఇటీవల ఖరీదైన మాదకద్రవ్యాలు వాడుతున్నట్లు గుర్తించిన విద్యాసంస్థ ప్రతినిధి బుకాయింపు. అయితే, అక్కడ చదివే పిల్లల్ని ప్రశ్నిస్తే రెండేళ్లుగా తాము ఎల్ఎస్‌డీబ్లాట్స్, ఓజీ(ఓషన్‌గ్రోన్)గంజాయి హాస్టల్‌లోనే వాడుతున్నట్లు చెప్పారు'.'సార్.. మా అబ్బాయి డ్రగ్స్‌కు అలవాటుపడినట్లు తెలియదు. మంచి ర్యాంక్ సాధించి సీటు తెచ్చుకు న్నాడు. అంత తెలివైనవాడిపై మీరు అభాండాలు మోపడం తగదు. ప్రభుత్వ శాఖలో ఉన్నతహోదాలో ఉన్న ఒక తల్లి వాదన. దీంతో అక్కడికక్కడే ఆ విద్యార్థికి వైద్యపరీక్ష నిర్వహించి డ్రగ్స్ వాడుతున్నట్లు తేల్చారు'.

**పోలీసు దాడులతో వెలుగులోకి సంచలనాలు**

షాద్‌నగర్ సమీపంలోని ప్రముఖ విద్యాసంస్థలో వేల మంది విద్యార్థులు ఒడగా.. అధికశాతం ఉన్నత కుటుంబాల నుంచి వచ్చినవారే. వారిలో 40 శాతం మంది మత్తుపదార్థాలకు అలవాటుపడినట్లు తాజా తనిఖీల్లో వెలుగుచూశాయి. శామీర్‌పేట్ వద్ద ఉన్న ప్రఖ్యాత విద్యాలయంలోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వ వైద్యకళాశాలలో జూనియర్ డాక్టర్లు గంజాయి మత్తులో జోగుతున్న ఘటన కలకలం సృష్టించింది. ధూల్‌పేట్‌లో గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసేందుకు వెళ్లి పట్టుబడిన 2400 మందికి ఎక్సైజ్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిలో 1500 మంది ఇంటర్ నుంచి పీజీ చదువుతున్న విద్యార్థులే ఉన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మొదలు.. నానరామ్‌గూడ ఐటీ సెక్టార్ వరకు మత్తులో జోగుతున్న యువతను చూసి వారు ఉలికిపాటుకు గురవుతున్నారు. తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీన్యాబ్) దాడుల్లో సంచలనం కలిగించే విషయాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాలుగు ప్రముఖ విద్యాసంస్థల్లో చదువుతున్న వందల మంది విద్యార్థులు మత్తు ఉచ్చులో చిక్కి విలవిల్లాడుతున్నట్లు నిర్ధారించారు. యాంటీడ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయకపోవడాన్ని గుర్తించిన టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య.. ప్రముఖ విద్యాసంస్థ ఛైర్మన్‌ను గట్టిగా మందలించినట్టు సమాచారం.

**ఆపేదెవరు.. అడిగేదెవరు**

నగరం సహా శివారు ప్రాంతాల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన వర్సిటీల్లో దేశవిదేశాలకు చెందిన లక్షల మంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. వాటిల్లో అనుభవం ఉన్న బోధనా నిపుణులు, అద్భుతమైన సంరక్షణ ఉందని ధీమాగా ఉన్న తల్లిదండ్రులు ఉలికిపాటుకు గురయ్యే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. నాలుగు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు గంజాయి, కొకైన్, ఓజీ, ఎల్ఎస్‌డీ బ్లాట్స్ తీసుకుంటున్నట్టు టీజీన్యాబ్ తనిఖీల్లో బయడపడ్డాయి. ఎత్తయిన గోడలు.. బయటివ్యక్తులు లోపలికెళ్లకుండా పటిష్ఠ భద్రత ఉన్న ఆ ప్రాంగణాల్లోకీ డ్రగ్స్ చేరుతున్నాయి. అక్కడినుంచి యథేచ్ఛగా బయటకు వస్తున్న విద్యార్థులూ ధూల్‌పేట్, నానక్‌రామ్‌గూడ, శంషాబాద్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లోని పెడ్లర్స్ నుంచి కావాల్సిన డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. హాస్టల్ గదుల్లోకి మత్తుపదార్థాలను తీసుకెళ్లి అక్కడే స్నేహితుల మధ్య వాటిని తీసుకుంటున్నారు. హాస్టల్‌లో విద్యార్థులను పర్యవేక్షించాల్సిన వార్డెన్‌లు రాత్రి 9 గంటలు దాటగానే ఇళ్లకు చేరుతున్నారు. ఈ క్రమంలో ప్రైవేటు భద్రతా సిబ్బందికి కాసులు ఎరవేసి.. బయటకొచ్చి పనిముగించుకొని గదులకు తిరిగి చేరుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో విద్యార్థులు వెల్లడించినట్లు సమాచారం. శామీర్‌పేట్‌లోని ఒక విద్యాసంస్థలో పరిస్థితి చేయిదాటిందని... అక్కడ చదువుతున్న ప్రతి పది మందిలో ఇద్దరు మత్తుపదార్థాలు తీసుకుంటున్నట్టు తెలిసిందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తమకు దొరికిన స్వేచ్ఛతో అధికశాతం విద్యార్థులు స్నేహితుల ప్రభావంతో తొలుత రుచి చూసేందుకు మత్తుకు దగ్గరవుతున్నారు.

# కబ్జాకు వత్తాసు ఉద్యానస్థలం ఖల్లాస్

కుత్బుల్లాపూర్ : గత లేఅవుట్‌లోని ఉద్యాన స్థలాలపై కన్నేశారు. ఎలాగైనా వాటిని కబ్జా చేసి సొమ్ము చేసుకోవాలనుకున్నారు. దీంతో పాత లేఅవుట్ స్థానంలో మరో లేఅవుట్‌ను(నిర్దేశించిన ఉద్యాన స్థలాలు లేకుండా) సృష్టించారు. తర్వాత పట్టణ ప్రణాళిక, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది అండదండలతో వాటిని ప్లాట్లుగా విభజించి పక్క పాట్ల నంబర్ల ఆధారంగా బై నంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసి విక్రయించారు. ప్రశ్నించిన వారిని బెదిరించి రూ.150 కోట్ల విలువ చేసే 45 వేల చ.గ. స్థలాలను కాజేసిన వైనం గాజులరామారం సర్కిల్ మహదేవపురం కాలనీలో వెలుగులోకి వచ్చింది.

**ఇదీ పరిస్థితి** గాజులరామారంలోని 281 నుంచి 284.. 288 నుంచి 299, 302,303, 308బై1.. 309 నుంచి 318 సర్వే నంబర్లకు చెందిన 167 ఎకరాల ప్రైవేట్ పట్టా భూమిని 1975 ఫిబ్రవరి 6న సుమారు 1900 ప్లాట్లతో గ్రామ పంచాయతీ లేఅవుట్‌ను రూపొందించారు. ఈ లేఅవుట్‌లో 14 చోట్ల సుమారు 83,722 చదరపు గజాల ఖాళీ స్థలాలు కేటాయించారు. అనంతరం లేఅవుట్ నిర్వాహకులు సంబంధిత లేఅవుట్‌ను క్రమబద్ధీకరించుకోవడానికి 1995 ఆగస్టు 4న దరఖాస్తు చేసినా అనుమతి లభించలేదు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు 2008 నుంచి ఎల్ఆర్ఎస్ చేయించుకొని ఇళ్లు నిర్మించుకున్నారు.

**నిర్వాహకులతో కుమ్మక్కై..** 2012 తర్వాత కొందరు స్వార్థపరుల కన్ను ఖాళీగా ఉన్న ఉద్యాన స్థలాలపై పడింది. లేఅవుట్ రూపొందించిన వారితో కుమ్మక్కై గతంలో రూపొందించిన లేఅవుట్‌ను పూర్తిగా మార్చేసి స్థానికుల సామాజిక అవసరాలు, ఉద్యానాల కోసం నిర్దేశించిన సుమారు రూ.150 కోట్ల విలువ చేసే 45 వేల చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఎల్ఆర్ఎస్ చేయించుకొని అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారు.

**రంగనాథ్ పర్యటనతో..** స్థానికుల అభ్యర్థన మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ రంగనాథ్ ఈ నెల 16న కాలనీలో పర్యటించి.. ఆక్రమణకు గురైన ఉద్యాన స్థలాలను పరిశీలించారు. ఆ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను చూసి అవాక్కయ్యారు.

# కాన్పు.. వసూళ్ల ట్రేన్పు!

కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణం రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో సేవలు పొందాలంటే అడిగినంత ముట్టజెప్పాల్సి వస్తోందని బాలింతలు, గర్భిణుల కుటుంబాలు వాపోతున్నాయి. ఇక్కడ పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులు చేయి తడపనిదే సేవలు అందించే పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కాన్పుల విషయంలో వైద్యుల ఖర్చుల పేరుతో డబ్బులు తాగుతున్నారని బాధిత పేద కుటుంబాలు పేర్కొంటున్నాయి. అడిగినంత ఇవ్వకపోతే దౌర్జన్యానికీ వెరవడం లేదని వాపోతున్నారు. పైగా, 'ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే జేబులు గుల్ల చేయరా? మాకివ్వడానికే పేదరికం అడ్డొస్తుందేమిటో?' అని సూటిపోటు మాటలు అంటున్నారని తెలుస్తోంది. వార్డులు శుభ్రం చేసే దగ్గర్నుంచి ఉచితంగా సేవలందించాల్సి '102' అంబులెన్స్ సదుపాయం వరకు ఒక్కో రేటు ఖాయం చేశారు. 'కాన్పు చేయించుకుందామని వస్తే రూ.5 వేల వరకు ఖర్చవుతోంది. శుభ్రపరిచే రసాయనాలు, సబ్బుల ఖర్చులనూ మాపైనే మోపుతున్నారు.



ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టాలి' అని బాధితులు కోరుతున్నారు.

దూర ప్రాంతానికి చెందిన నిండు గర్భిణి నాలుగు రోజుల క్రితం పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేరింది. నొప్పులు భరించలేను.. ప్రసవం చేయాలని ఆమె ప్రాధేయపడినా సిబ్బంది స్పందించలేదు. పైగా చీదరించుకున్నారు. ఆ ఛీత్కారాలు తట్టుకోలేక గర్భిణిని కుటుంబీకులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

భద్రాచలం సబ్ డివిజన్ పరిధి నుంచి మూడో కాన్పు నిమిత్తం ఓ పేదరాలైన గర్భిణి ఎంసీహెచ్‌లో చేరింది. ఆమె వద్ద తల్లి తప్పితే ఎవరూ లేరు. కాన్పు తర్వాత అడిగినంత డబ్బులివ్వాలని ఆమెపై కాంట్రాక్టు కార్మికులు ఒత్తిడి తెచ్చారు. తమ వద్ద లేవని వారు ప్రాధేయపడినా వినలేదు. చేసేది లేక తమ వద్దనున్న కొంత మొత్తాన్ని ముట్టజెప్పాల్సి వచ్చింది.

చర్ల మండలానికి చెందిన మరో నిండు గర్భిణి ఇటీవల ఆసుపత్రికి వచ్చింది. ఆమె ఉన్న వార్డు పారిశుద్ధ్య కార్మికులు రూ.200 వసూలు చేశారు. కాన్పు తర్వాత వాహనంలో ఇంటి వద్ద దింపినందుకు మరో రూ.600లు సమర్పించుకోవాల్సి వచ్చింది.

వసూళ్ల తీరు ఇలా..

(పలువురు బాధితుల పరిశీలన ఆధారంగా..)

జనరల్ వార్డులో ఊడ్చేవారికి: రూ.200

కాన్పులవార్డు వద్ద ఆయాకు: రూ.600

కాన్పుల వార్డు నుంచి జనరల్ వార్డుకు చేర్చినందుకు: రూ.500

ప్రసవం ఖర్చులు (వైద్యులు సహా): రూ.3,000

కాన్పు తర్వాత ఇంటికి వాహనంలో చేర్చినందుకు: రూ.600

పుట్టిన బిడ్డను శుభ్రం చేసినందుకు: రూ.300

**రామవరం ఎంసీహెచ్ ఆసుపత్రి భవనం**

ఆసుపత్రిలో కొందరు సిబ్బంది ఖర్చుల పేరుతో డబ్బులు తీసుకుంటున్నారని మా దృష్టికి పలువురు తీసుకొచ్చారు. ఇది తగదని కాంట్రాక్టు సిబ్బందిని హెచ్చరిస్తూనే ఉన్నాం. నిర్వహణ అంశంపై తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నాం. రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. ఏ సేవలైనా ఆసుపత్రిలో ఉచితమని ఈ సందర్భంగా ప్రజలకు సూచిస్తున్నాను. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే మాకు చెప్పాలి. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. '102'లో ఇంటికి ఉచితంగా చేర్చాలనేది నిబంధన. డబ్బులు వసూలు చేస్తున్న వైనాన్ని డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తా. డా.కె.వీరబాబు, ఎంసీహెచ్ ఆర్ఎంఓ

# సుడా కుర్చీ ఎవరికో!



ఖమ్మం : స్తంభాద్రి పట్టణాభివృద్ధి సంస్థ (సుడా) ఛైర్మన్ పదవి కోసం జిల్లా కాంగ్రెస్ నాయకుల్లో తీవ్రపోటీ నెలకొంది. ఇప్పటి వరకు ఈ అంశంపై పెద్దగా దృష్టి సారించకపోగా.. పలువురు మాజీ, తాజా కార్పొరేటర్లు, నగరానికి చెందిన ఒకరిద్దరు అధికారి పార్టీ నేతలు తమ ప్రయత్నాలు ప్రస్తుతం ముమ్మరం చేయడం చర్చనీయాంశంగా మారింది.

మంత్రులు ప్రాతినిధ్యం వహించే ఖమ్మం, మధిర, పాలేరు నియోజకవర్గాలకు చెందిన అధికార పార్టీ నేతలు పదవి కోసం తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చివరకు అదృష్టం ఎవరిని వరిస్తుందోనన్న ఆసక్తి అధికార పార్టీ వర్గాల్లో నెలకొంది.

ఎత్తుగడ వేసినా..అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు కార్పొరేటర్లు మేయర్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉండటమే దీనికారణం. కానీ, అనూహ్యంగా ఆమె సైతం పార్టీ మారడంతో ఆయా కార్పొరేటర్ల ఆశలు అడియాసలయ్యాయి.

వారి చుట్టూ.. ప్రదక్షిణలు

ప్రజాప్రతినిధుల ఆశీర్వాదంతో ఛైర్మన్ పదవి దక్కించుకునేందుకు కొద్దిరోజులుగా ఆశావహులు వారిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఛైర్మన్‌తో పాటు 11 మంది సలహాదారులతో ఏర్పడాల్సిన పాలకవర్గంలో ఎవరిని నియమిస్తారోనన్న ఉత్కంఠ నేతల్లో నెలకొంది. ఇదే సమయంలో సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందించిన వారు కూడా తమకు అవకాశం కల్పించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఇప్పటి వరకు నూతన కార్యవర్గం విషయమై ఎవరి పేరును అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటించకపోయినా.. ఆశావాహులు మాత్రం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# తపాలా సేవ.. సాంకేతిక తోవ

మిర్యాలగూడ : మారుతున్న కాలానికనుగుణంగా తపాలా శాఖ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తోంది. ప్రైవేట్ సంస్థల నుంచి వచ్చే పోటీని తట్టుకునేందుకు సిబ్బందిని సిద్ధం చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బందికి అధికారులు 5జీ చరవాణులు పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని నల్గొండ డివిజన్‌లో 358, సూర్యాపేట డివిజన్‌లో 318 చరవాణులు పంపిణీ చేయగా.. తాజాగా సూర్యాపేట డివిజన్‌లో సిబ్బందికి మినీ ముద్రణ యంత్రాలను సైతం అందించారు. ఇంటి వద్దనే సేవలు..ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్, నల్గొండ, భువనగిరిలో పోస్టల్ పేమెంట్స్ బ్యాంకులు ఉన్నాయి. వీటిలో ఖాతాలు తెరవాలంటే సమీపంలోని తపాలా కార్యాలయానికి వెళ్లాలి. దీనికి సుమారు గంట పైనే సమయం పడుతుంది. దీన్ని నివారించేందుకే తపాలా శాఖ ఆధ్వర్యంలో సిబ్బందికి 5జీ చరవాణులు అందించి ఇంటి వద్ద కానీ, కార్యాలయంలో కానీ రెండే నిమిషాల్లో ఖాతా తెరుస్తున్నారు. దీంతో అన్ని కార్యాలయాల్లో తపాలా ఖాతాలు ఇటీవల గణనీయంగా పెరిగాయి. దీంతో పాటు రాష్ట్రంలోనే మొదటిసారిగా సూర్యాపేట డివిజన్ పరిధిలో గత నెలలోనే చిన్న ముద్రణ యంత్రాలను పంపిణీ చేశారు. వీటి ద్వారా సిబ్బంది చరవాణి నుంచే ప్రింట్ తీసి ఖాతాదారులకు అందించే వెసులుబాటు కలుగుతోంది.

కొనసాగుతున్న సేవలు..తపాలా శాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పలు పథకాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. వీటిలో ముఖ్యమై



నవి సుకన్య సమృద్ధి యోజనతో పాటు రూ.399, రూ.499 ఏడాది ప్రీమియంతో అందించే రూ.10 లక్షలు, రూ.15 లక్షల బీమా పథకాలు, బాల ఆధార్, తపాలా కార్యాలయాల్లో ఆధార్ కేంద్రాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వీటితో పాటు మహిళ ఆర్థికాభ్యున్నతికి ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం, పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక స్వావలంబన అందించేందుకు వడ్డీ రేట్ల పెంపు వంటివి సైతం ప్రజలను ఆకర్షిస్తున్నాయి.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి– వెంకటేశ్వర్లు, తపాలా సూపరింటెండెంట్, సూర్యాపేట డివిజన్

తపాలా శాఖ ఆధ్వర్యంలో అందించే పలు పథకాలను సాంకేతికంగా అభివృద్ధి చేశాం. పొదుపు ఖాతాలు, జమ, ఖర్చులు, చెల్లింపులు వంటి సమస్త సేవలు చరవాణిలో అందించనున్నాం. ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవల రసీదులు అందించేందుకు గత నెలలోనే ముద్రణ యంత్రాలను సిబ్బందికి పంపిణీ చేశాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# నిర్వహణ భారం.. పర్యవేక్షణ కరవు



ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు గత ప్రభుత్వం హరితహారం పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఏటా పట్టణాల్లో, గ్రామాల్లో మొక్కలు నాటుతున్నారు. హరితహారంతో పచ్చదనంతో పాటు గ్రామస్థులు సేదతీరడానికి ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, మండలానికి అయిదు చొప్పున బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి, బృహత్ ప్రకృతి వనాలు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పిచ్చి మొక్కలు, చెత్తచెదారంతో దర్శనమిస్తున్నాయి.

486 వనాల్లో 50 లక్షల మొక్కలు

జిల్లాలోని ప్రతి మండలానికి 5 చొప్పున బృహత్ ప్రకృతి వనాలు, ప్రతి గ్రామానికి ఒక పల్లె ప్రకృతి వనాన్ని మూడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. జిల్లాలో 419 పల్లె ప్రకృతి వనాల్లో సుమారు 7 లక్షల మొక్కలు పెరుగుతున్నాయి. జిల్లాలో 90 బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 67 బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయగా అందులో సుమారు 43 లక్షల మొక్కలు పెరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల లభ్యతను బట్టి 10 గుంటల నుంచి ఎకరం భూమిలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అలాగే 5 ఎకరాల నుంచి పది ఎకరాల వరకు లభ్యతను బట్టి బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఆయా వనాల్లో మూడు సంవత్సరాల కిందట పండ్లు, పూలు, నీడనిచ్చె మొక్కలను నాటటడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి.

నిర్లక్ష్యానికి గురవుతున్న వనాలు

పచ్చదనం పెంపుతో పాటు ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం పల్లె ప్రకృతి, బృహత్ వనాలను ఏర్పాటు చేసింది. వనాల్లో ప్రజలు నడక కోసం ట్రాక్, సేద తీరడానికి సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. కానీ పల్లె, బృహత్ ప్రకృతి వనాల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వనాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పల్లె, బృహత్ ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను మొదటి రెండు సంవత్సరాలు ఉపాధి హామీ పథకం సిబ్బంది చూడగా తర్వాత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. జిల్లాలో పలు చోట్ల పల్లె ప్రకృతి వనాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఉపయోగపడడం లేదు. అలాగే వనాల గేట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. ఆకులు రాలిపోయి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారాయి. వనాల్లో దీపాలను ఏర్పాటు చేయక పోవడంతో పలు చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

సంరక్షణ బాధ్యత పంచాయతీలదే – సంపత్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

పల్లె, బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిన తర్వాత మొదటి రెండు సంవత్సరాలు నిర్వహణ బాధ్యతను ఉపాధి హామీ పథకం సిబ్బంది తీసుకుంటారు. అనంతరం వనాల నిర్వహణ, మొక్కల సంరక్షణ బాధ్యతలు గ్రామ పంచాయతీలకే ఉంటుంది. పంచాయతీ నిధులతోనే నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది.

# నలుదిక్కులా పచ్చందాలు

నర్సాపూర్: వేసవిలో ఓ వైపు ఎండలు మండుతుండగా.. నర్సాపూర్ పురపాలక సంఘం అధికారులు మొక్కలు నాటి సంరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో నర్సాపూర్– తూప్రాన్– మెదక్– హైదరాబాద్– సంగారెడ్డి మార్గాల్లో పచ్చందాలు కనువిందు చేయనున్నాయి. రాయరావు చెరువు కట్టపై పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఇవి సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

ప్రత్యేక ప్రణాళికతో... వర్షాలు ప్రారంభం కాకముందే మొక్కలు నాటుతున్నారు. ఎండాకాలంలో నాటినవి బతికితే వాటికి తిరుగుండదని భావిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. పురపాలిక పరిధిలో ప్రత్యేకంగా నర్సరీ లేకున్నా బయటి మార్కెట్లో కొని తీసుకొచ్చి నాటి సంరక్షిస్తున్నారు. పుర పరిధిలోని 15 వార్డుల్లో నాటుతున్నారు. వేసవిలో వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కొంత పచ్చదనం పెరిగిందని అంటున్నారు.పలు మార్గాల్లో... పట్టణం మీదుగా వెళుతున్న మెదక్– హైదరాబాద్(765–డి)తోపాటు సంగారెడ్డి– తూప్రాన్ జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటిస్తున్నారు. రోజూ ఉ




దయం, సాయంత్రం మొక్కలకు ట్యాంకర్లతో నీరందిస్తున్నారు. ఇందుకోసం ఓ అధికారికి బాధ్యతలు అప్పగించారు. 50వేల మొక్కలు ఇళ్లకు పంపిణీ చేయడంతోపాటు 24వేలు రహదారుల వెంట నాటాలని నిర్ణయించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 9 రకాలున్నాయి.

కంటికి రెప్పలా కాపాడుతున్నాం..

– అశోక్‌గౌడ్, పురపాలిక అధ్యక్షుడు

పురపాలిక సమావేశంలో చర్చించి నిర్ణయించిన మేరకు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటాలని నిర్ణయించాం. ఈ మేరకు మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందించుకున్నాం. ఇంతవరకు నాటిన మొక్కలతో మంచి ఫలితాలు వస్తున్నాయి. భవిష్యత్తులో మహా వృక్షాలుగా మారుతాయి.

# వానాకాలం సాగుకు సిద్ధం



ఎల్లారెడ్డిపేట: గత సంవత్సరం కురిసిన వర్షాలతో యాసంగిలో విస్తారంగా పంటలు సాగయ్యాయి. వరి కోతలు చేపట్టిన రైతులు ఎట్టకేలకు ధాన్యం విక్రయాలను పూర్తిచేశారు. పశుగ్రాసాన్ని సైతం రవాణా చేసి, నిల్వ చేసుకున్నారు. ఈ జూన్‌లో వానాకాలం సీజన్ సాగుకు సిద్ధమవుతున్నారు. నైరుతి రుతుపవనాల పలకరింపునకు ఎదురు చూస్తూనే పొలాలను శుభ్రపరుచుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. చిన్న కమతాలను పెద్దగా తీర్చిదిద్దుకోవడం, వ్యవసాయ క్షేత్రాల్లో పనికిరాని చెట్లను తొలగించుకోవడం తదితర పనులు చేస్తున్నారు. కొన్నిచోట్ల నారుమడుల తయారీకి శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు ఎరువులు, విత్తనాలను సమకూర్చుకుంటున్నారు. ఎప్పటిలాగే ఈ వానాకాలం సీజన్‌లో అన్నదాతలు వరిపంట సాగుకే మొగ్గు చూపనున్నారు. ఆ తర్వాత పత్తిసాగుకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ సీజన్‌లో జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు విత్తనాలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. రాయితీపై తీసుకొచ్చిన జీలుగ విత్తనాలను కమతాల్లో చల్లుకుంటున్నారు. సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. మరోవైపు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు విత్తన విక్రయ దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

18 వేల ఎకరాల్లో వరి...

మెట్ట ప్రాంతమైన ఎల్లారెడ్డిపేట మండలంలో వ్యవసాయానికి బోరుబావులు, బావులు ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోగా భూగర్భజల మట్టాలు వృద్ధి చెందాయి. చెరువుల నుంచి సాగునీటిని ఆయకట్టు భూములకు విడుదల చేయగా ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పడిపోయాయి. యాసంగిలో కొన్ని చోట్ల సాగునీటి కొరతతో వరిపంట ఎండిపోయింది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. కాగా ఈ ఏడాది వానాకాలం సీజన్ పంటల సాగు ప్రణాళికను అధికారులు రూపొందించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రధానంగా 18 వేల ఎకరాల్లో వరిపంటను సాగుచేయనున్నారు. అలాగే 4500 ఎకరాల్లో పత్తి, 50 ఎకరాల్లో మొక్కజొన్న, 100 ఎకరాల్లో కంది పంటలు సాగవుతాయని అంచనా వేశారు. 4,500 క్వింటాళ్ల వరి, 300 కిలోల కంది, నాలుగు క్వింటాళ్ల మొక్కజొన్న, 11,250 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయని గుర్తించారు. అందుకు సరిపడా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.60 మిల్లీమీటర్ల వర్షం కురిసిన తర్వాతే విత్తుకోవాలిఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అవసరం మేరకు విత్తనాలను దిగుమతి చేస్తాం. ఎరువుల అవసరం ఏమేరకు ఉంటుందో నివేదికలు పంపాం. ఎక్కడా విత్తనాలు, ఎరువుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామాల్లో రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను సరఫరా చేశాం. 60 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనప్పుడు మాత్రమే పత్తి విత్తనాలను విత్తుకోవాలి. తొందరపడి వేస్తే మొలక శాతం తగ్గుతుంది. రైతులపై అదనపు భారం పడుతుంది. భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

# హరిత లక్ష్యం ఖరారు

తలమడుగు : జిల్లాలో హరితహారం లక్ష్యం ఖరారైంది. 2024లో జిల్లా వ్యాప్తంగా 25.03 లక్షల మొక్కలు నాటనున్నారు. ఇందుకోసం 468 నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే నర్సరీల్లో విత్తనాలు విత్తారు. మొక్కలు నాటేందుకు సైతం సిద్ధం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిదేళ్లలో సుమారు 1.65 కోట్ల మొక్కలు నాటారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హరితహారానికి ప్రాధాన్యం ఇస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా పల్లె నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నా వాటిని సంరక్షించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో 468 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఈ సంవత్సరం ఒక్కో పంచాయతీలో 10 వేల మొక్కలు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే నర్సరీల్లో లక్ష్యానికి అవసరమైన హరితహారం మొక్కలను అధికారులు అందుబాటులో ఉంచేందుకు పెంచుతున్నారు. ఎండల తీవ్రతకు మొక్కలు వాడిపోకుండా నీటి సౌకర్యంతో పాటు నర్సరీల పైభాగంలో షేడ్ నెట్‌లను ఏర్పాటు చేశారు. జులై మొదటి వారంలో మొక్కలు నాటేందుకు అధికారులు కసరత్తు చేయడంతో ఉపాధి హామీ సిబ్బంది వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆరు విభాగాలుగా వ్యవసాయ గట్లు, చెరువు కట్టలపై, పశుపక్ష్యాదులు, కోతులు, ప్రజలు తినేందుకు అవసరమైన పండ్ల మొక్కలు, ఇళ్లలో పెంచేందుకు వీలుగా వివిధ పూలు తదితర 56 రకాల మొక్కలు పెంచుతున్నారు.

ఆలోచిస్తే మరింత ప్రయోజనం

2016–17 నుంచి గతేడాది వరకు 1.65 కోట్ల మొక్కలు నాటారు. వీటిని నాటే విషయంలో భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను గుర్తించకపోవడం, కొన్ని ప్రాంతాల్లో సరైన నిర్వహణ లేక లక్ష్యం నెరవేరని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా విద్యుత్తు తీగల కిందే వాటిని నాటడంతో అవి ఏపుగా పెరిగి పైవరకు చేరుకుంటున్నాయి. ఈదురుగాలుల సమయంలో విద్యుత్తు అంతరాయం నెలకొంటోందని, ఆ శాఖ అధికారులు వాటిని తొలగించడంతో చాలా చోట్ల ఇబ్బందులు ఎదురైన సంఘటనలు ఉన్నాయి. మరో వైపు కొన్ని చోట్ల లక్ష్యం పూర్తి చేయడంపై కనబరుస్తున్న శ్రద్ధ వాటి పర్యవేక్షణ విషయంలో లేక ఎదగాల్సిన మొక్కలు మోడుగా మిగులుతున్నాయి.

తలమడుగు మండలం సుంకిడి, ఖోడద్ అంతర్రాష్ట్ర రహదారికి ఇరువైపులా పచ్చదనంతో కనువిందు చేస్తున్న ఈ చెట్లు గత ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా నాటారు. ఏపుగా పెరిగి పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. విద్యుత్తు తీగలకు ఇబ్బందులు కాకుండా నాటడంతో మరింత ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.హరితహారం విజయవంతంపై ప్రత్యేక దృష్టి

– సాయన్న, డీఆర్‌డీవో, ఆదిలాబాద్

2023–24 సంవత్సరానికి సంబంధించి ప్రతి పంచాయతీకి 10 వేల చొప్పున మొక్కలు పెంచేలా లక్ష్యం నిర్దేశించాం. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. అన్ని పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మొక్కలు వాడిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జులైలో మొక్కలు నాటే సమయంలో విద్యుత్తు తీగల కింద నాటకుండా దృష్టిసారిస్తున్నాం. వర్షాలు కురిసిన వెంటనే నాటేలా తగిన కార్యాచరణ రూపొందించాం.

# ఖాళీలతో పట్టు సాధ్యమెలా?

కొత్తకోట : పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల సాగుకు కేంద్ర ప్రభుత్వం పలు రాయితీ పథకాలను అమలు చేస్తోంది. వీటిని రైతుల చెంతకు తీసుకెళ్లి, అమలు చేసేలా చూసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది కొరతతో ఏటా సాగు లక్ష్యం నెరవేరడం లేదు. ఏడాదికేడాది పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగు చేస్తున్న వారి సంఖ్య తగ్గిపోతోంది. ఏటా ఉమ్మడి జిల్లాలో పట్టు సాగు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నా ఫలితం లేదు. ప్రస్తుతం పట్టు పరిశ్రమ శాఖలో పని చేస్తున్న అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో పూర్తి స్థాయిలో సేవలందడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటే వ్యవసాయంతో పాటు పట్టు వైపు రైతులు ముందడుగు వేసేందుకు అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో వివిధ విభాగాల్లో మొత్తం 78 పోస్టులున్నాయి. ఇందులో కేవలం 7 పోస్టులకు మాత్రమే అధికారులు ఉన్నారు. మిగతా 71 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.మహబూబ్‌నగర్‌లో 32 పోస్టులకు డీడీ, ఇద్దరు పట్టుపరిశ్రమ శాఖ అధికారులు, సహాయ సాంకేతిక నిపుణుడు, ఎల్‌డీ టైపిస్టు పోస్టు మాత్రమే భర్తీ చేశారు. మిగతా 27 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వనపర్తి జిల్లాలో 14 పోస్టులకు 1 కాపలాదారుడితో పాటు వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాకు సంబంధించి ఒక అధికారి పోస్టు భర్తీ చేశారు. ఇక్కడ 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జోగులాంబ గద్వాల జిల్లాలో 19 పోస్టులకు సహాయ పట్టుపరిశ్రమ శాఖ అధికారి మాత్రమే ఉన్నారు. ఇక్కడ మిగతా 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 14 పోస్టులకు సాంకేతిక సహాయ కుడు మాత్రమే ఉన్నారు. మిగతా 13 పోస్టులను భర్తీ చేయలేదు.



నారాయణపేట జిల్లాకు ఇప్పటి వరకు పట్టుపరిశ్రమ శాఖకు ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదు. వికారాబాద్ జిల్లాకు చెందిన అధికారిణి నారాయణపేట జిల్లాకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపిచాం

ఉమ్మడి జిల్లాలో పట్టుపరిశ్రమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పోస్టులు భర్తీ చేస్తే జిల్లాకు కావాల్సిన అధికారులను, సిబ్బందిని కేటాయిస్తారు. మరోమా రు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.లక్ష్మయ్య, పట్టుపరిశ్రమ శాఖ డీడీ, మహబూబ్‌నగర్.

# ఆహార పరిశ్రమలతో అతివలకు అండ

గద్వాల ప్రజలకు కల్తీ లేని శుద్ధమైన ఆహారం అందించడం.. పంటలు పండించే రైతులకు, పొదుపు సంఘాల మహిళలకు ఆదాయ కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఫుడ్‌ప్రాసెసింగ్, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా పీఎమ్‌ఎఫ్‌ఎమ్‌ఈ (ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్) పథకాన్ని అమలు చేస్తోంది. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం స్థానిక వనరులకు తగ్గట్లుగా ఒక్కో జిల్లాలో ఒక్కో రకమైన పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆయా జిల్లాల సెర్ప్ అధికారుల నుంచి వివరాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదించారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలోని అతివలకు ఆర్థిక తోడ్పాటు లభించనుందని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో యూనిట్ల ఏర్పాటు : ఉమ్మడి జిల్లాలో 36,286 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వీటిలో 5.44 లక్షల మంది మహిళలు సభ్యత్వం కలిగి ఉన్నారు. వీరిలో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి పీఎమ్‌ఎఫ్‌ఎమ్‌ఈ పథకం ద్వారా ఏటా ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా కారం, పసుపు, పప్పు మిల్లులు, పాల పదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె తయారీ, చిన్న రైస్ మిల్లులు, అప్పడాలు, పచ్చళ్ల తయారీ తదితర యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అయితే..ఇది పూర్తి స్థాయిలో నెరవేరడం లేదు. ఏటా 60 నుంచి 70 శాతం యూనిట్ల ఏర్పాటే జరుగుతోంది. ఇందులో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను జోగులాంబ గద్వాల జిల్లాలోనే తీసుకుంటే.. 62 యూనిట్లను నెలకొల్పడం లక్ష్యంగా ఉండగా, 42 యూనిట్లను మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి జిల్లాలోనూ ఆహారశుద్ధి పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# ఏడాదిగా ఎదురుచూపులే!

ఉట్నూరు: ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదివే ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో వసతుల మాటమోగానీ.. పిల్లలకు వడ్డించే భోజన బిల్లుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. ఏడాదిగా నిధుల విడుదల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. మరికొన్ని రోజుల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలల్లో అమలు చేయాల్సిన ఆహార పట్టిక, నిత్యావసర సరకుల పంపిణీకి సంబంధించిన కొత్త కార్యాచరణ ప్రణాళిక కరవైంది. ఉమ్మడి జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధీనంలో 134 గిరిజన ఆశ్రమ పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో చదివే 40,427 మంది ఆదివాసీ గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు భోజనం, నివాస వసతిని ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కల్పిస్తోంది. సర్కారు గిరిజన సంక్షేమ శాఖలకు భోజన ఖర్చుల కోసం బడ్జెట్‌ను విడుదల చేస్తోంది. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు నిత్యావసర సరకులు, కాస్మెటిక్స్‌ను పంపిణీ చేస్తారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆహార పట్టిక ప్రకారం మూడు పూటల భోజనం, సాయంత్రం స్నాక్స్‌ను విద్యార్థులకు అందజేస్తారు.అసలు సమస్య ఇదీ..రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలకు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సంబంధించి భోజన ఖర్చులు విడుదల చేస్తారు. వాటిని గిరిజన సహకార సంస్థ(జీసీసీ)కి అందజేసి టెండర్లను నిర్వహించి ఆశ్రమ పాఠశాలలకు అవసరమైన నిత్యావసర సరకులు, కాస్మెటిక్స్‌ను పంపిణీ చేస్తారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలోని 134 ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన రూ.20 కోట్లు డైట్ బిల్లుల బకాయిలను ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయలేదు. టెండర్ల ద్వారా నిత్యావసర సరకులు సరఫరా చేసి గుత్తేదారులు బిల్లుల కోసం ఐటీడీఏ చుట్టూ తిరుగుతున్నా.. నిధులు విడుదల కాలేదని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ పీవో, జిల్లాల గిరిజన సంక్షేమశాఖల అధికారులు పలుమార్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా.. ప్రయోజనం లేకుండాపోయిందని అధికారులు వాపోతున్నారు. గతేడాది బకాయిలు చెల్లించనిదే కొత్త విద్యాసంవత్సరంలో సరకులు సరఫరా చేయడం కష్టమని జీసీసీ సంస్థ నిస్సహాయత వ్యక్తం చేస్తోంది.

కొత్తగా ఏం చేద్దాం!బిల్లులు విడుదల కాకపోవడంతో కొత్త విద్యాసంవత్సరంలో ఆహార పట్టిక అమలుపై ఏం చేయాలో తేల్చుకోలేక ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖల అధికారులు మల్లగుల్లాలు పడతున్నారు. పాత బకాయిలు విడుదల చేస్తారా లేక నిత్యావసర సరకులను పంపిణీ చేస్తారా తెలియక సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎదురయ్యే భోజన సమస్యలను పూర్తిస్థాయిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖల అధికారులు పేర్కొంటున్నారు. బకాయిలు విడుదల సమస్యను వారికి వివరించామన్నారు. కొత్త ప్రణాళికపై వారిచ్చే ఆదేశాలను అమలు చేస్తామంటున్నారు.



## మంత్రులను మాయచేసేలా కొందరు అధికారుల తీరు..

అమరావతి: మంత్రులను మాయచేసేలా కొందరు అధికారులు సమాచారం ఇస్తున్నారని అసెంబ్లీ లాబీలో చర్చ జరిగింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మధ్య జరిగిన సంభాషణలో పలు విషయాలు చర్చకు వచ్చాయి. గత ప్రభుత్వానికి సంబంధించి సభ్యులు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వడం లేదంటూ అధికారులపై పవన్ కల్యాణ్, డోలా బాలవీరాంజయనేయ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ మూడోరోజు సమావేశాల్లో భాగంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారుల సరైన సమాచారం ఇవ్వలేదు. గ్రామ పంచాయతీల నిధుల మళ్లింపు విషయంలో అధికారులు ఇచ్చిన సమాచారంపై పవన్ కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వివరాల్లేకుండా 'అవును.. కాదు.. ఉ త్పన్నం కాదు' అనే రీతిలో అధికారులు సమాధానం ఇవ్వడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. పొడిపొడిగానే చెప్పాలనే నిబంధన ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. అనుబంధ పత్రాల్లో కాకుండా సభ్యులకు ఇచ్చే సమాధానంలోనే వివరాలు ఉండేలా చూడాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు విషయంలో అధికారుల సమాధానంపై డోలా అసంతృప్తి వ్యక్తం చేశారు. అవకతవకలపై సరైన సమాచారం ఇవ్వలేదన్నారు. పూర్తిస్థాయిలో వివరాలు అందజేయాలని ఇవ్వాలని ఆదేశించారు.



## టేకాఫ్ అవుతుండగా కూలిన విమానం.. 18 మంది మృతి

కాఠ్‌మాండూ: నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ కూలిపోయింది. రాజధాని నగరం కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కాఠ్‌మాండూ నుంచి పొఖారాకు బయల్దేరిన బాంబార్డియర్ సీఆర్‌జే 200 విమానం టేకాఫ్ అయిన క్షణాల్లోనే కూలిపోయింది. దీంతో మంటలు చెలరేగి విమానం దగ్ధమైంది. ప్రమాద సమయంలో విమానంలో సిబ్బందితో సహా 19 మంది ఉన్నారు. ఈ ఘటనలో 18 మంది మృతిచెందగా.. పైలట్ తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. గాయపడిన పైలట్‌ను విమానం నుంచి బయటకు తీసి, ఆసుపత్రికి తరలించారు. రన్‌వేపై నుంచి విమానం కూలుతున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## అవసరమైతే అదానీ కాళ్లైనా పట్టుకుంటా...



అమరావతి : ఏపీ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉ దయం ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో కృష్ణపట్నం పోర్టు అంశంపై చర్చ జరిగింది. కృష్ణపట్నంలో కంటైనర్ పోర్టును అదానీ తొలగించడంపై సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణపట్నంలో కంటైనర్ పోర్టు కోసం అదానీ కాళ్లు పట్టుకుంటానని ఆయన అన్నారు. కృష్ణపట్నంలోని కంటై నర్ పోర్టును అదానీ సంస్థ తీసేయడం వల్ల తీవ్ర నష్టం చేకూరుతోందని తెలిపారు. తరలిపోయిన కంటైనర్ పోర్టును కృష్ణపట్నానికి తీసుకురావాలని అదానీ కాళ్లైనా పట్టుకుంటా అని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. కంటైనర్ పోర్టు వెళ్లిపోవడం వల్ల 10 వేల మంది ప్రత్యక్షంగా ఉ పాధి కొల్పోయారన్నారు. పోర్టు కోసం భూములిచ్చామని... కంటైనర్ పోర్టు ఎత్తేయడం వల్ల తమ ప్రాంతం తీవ్రంగా నష్టపోతోందన్నారు.గతంలో అమరావతి నిర్మాణ పనుల కోసం కావాల్సిన ఎక్విప్మెంట్ కృష్ణపట్నం కంటైనర్ పోర్టు ద్వారానే దిగుమతి అయ్యేవని వెల్లడించారు. కంటైనర్ పోర్టు ఎత్తేయడం వల్ల మొత్తంగా 25 వేల ఎకరాల్లో ఉన్న వివిధ ఎస్ఈజెడ్లలోని కార్యకలాపాలు నష్టపోతున్నాయన్నారు. కంటైనర్ పోర్టు ఎత్తేసి... బూడిద తరలించే బల్క్ కార్గో పోర్టు ఉండడం వల్ల లాభమేంటి అని ప్రశ్నించారు. కృష్ణపట్నం పోర్టు కోసం సేకరించిన భూమి ఏమైపోతుందని నిలదీశారు. కృష్ణపట్నం నుంచి కంటైనర్ పోర్టు తరలించడం వల్ల ఒక్క ఆక్వా రంగానికే నెలకు రూ. 1000 కోట్ల మేర నష్టం వాటిల్లుతోందని వెల్లడించారు. కంటైనర్ పోర్టు తరలిపోతుంటే మారిటైం బోర్డు ఏం చేస్తోంది.. గోళ్లు గిల్లుకుంటోందా..? అంటూ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## ఏపీ మంత్రి ఆదేశాలను ఖాతరు చేయని ఆర్టీసీ ఈడీపై బదిలీ వేటు



అమరావతి: ఉద్యోగుల సమస్య పరిష్కారంపై రవాణాశాఖ మంత్రి ఆదేశాలను ఖాతరు చేయని ఏపీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారిపై బదిలీ వేటు పడింది. సమస్య పరిష్కార విషయమై కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావుకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మూడుసార్లు ఫోన్ చేశారు. ఈడీ లెక్కచేయకపోవడంతో ఆయన తీరుపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు. దీంతో ఈడీపై బదిలీ వేటు వేస్తూ రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఆదేశాలు జారీ చేశారు.

## జగన్.. ఏదైనా ఉంటే ప్రజల తరపున అసెంబ్లీలో పోరాడు.. అంతేకానీ



న్యూఢిల్లీ, జూలై 24: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి వచ్చి మంచి పరిపాలన అందిస్తున్నామని కర్నూల్ ఎంపీ బి.నాగరాజు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీకి నిధులు రావాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్ని శాఖల మంత్రులను కలిసి అభివృద్ధికి ప్రయత్నిస్తుంటే... జగన్ ఢిల్లీ వచ్చి ఫోటో షూట్ పెట్టి ప్రజలను డైవర్ట్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. విజయసాయిరెడ్డి నిర్వాకం తెరపైకి రాకుండా చేయాలని చూస్తున్నారన్నారు. వినుకొండలో రషీద్ హత్యను టీడీపీపై నెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరులో చంద్రబాబు, టీడీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వించారన్నారు.

నీటి ప్రాజెక్టుల సందర్శనకు చంద్రబాబు వెళ్తే అక్కడ టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టించారని వ్యాఖ్యలు చేశారు. టీటీడీలో తెలంగాణకు భాగం ఇస్తున్నారని ప్రచారం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేశారన్నారు.

**అంతలో ఎంత తేడా!** గతంలో వైసీపీ అధికారంలో ఉందని విధ్వంసం చేశారన్నారు. ఏరోజైనా అమరావతి పేరు పార్లమెంట్‌లో విన్నారా అని అడిగారు. జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్ళారని విమర్శించారు. జగన్ ఏమైనా ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజల తరపున పోరాటం చేయాలని సూచించారు. జగన్ దశ అయిపోయిందని.. ఆయన మాటలు ప్రజలు పట్టించుకోవద్దని ఎంపీ బి.నాగరాజు పేర్కొన్నారు.



## ఇసుక కుంభకోణంపై మంత్రి కొల్లు రవీంద్ర సమాధానం ఇదీ...

అమరావతి, జూలై 24: ఏపీ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక కుంభకోణంపై అసెంబ్లీలో చర్చ మొదలైంది. అవకతవకలకు పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని పర్చూరు ఎమ్మెల్యే సాంబశివ రావు ప్రశ్నించారు. దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర సమాధానమిస్తూ.. జేపీ వెంచర్స్ రూ.842 కోట్లు ప్రభుత్వానికి బకాయి పడిందని చెప్పారు. అయినా వారికి ఎటువంటి బకాయిలు లేవని ఆనాటి ఏపీఎండీసీ ఎండీ వెంకట రెడ్డి ఎన్ఓసీ ఇచ్చారన్నారు. వీళ్ళు ఎంత మేరకు తవ్వారు అనే అంశంపై శాటిలైట్ ఇమేజెస్ ద్వారా దర్యాప్తు చేయిస్తున్నామని మంత్రి కొల్లురవీంద్ర చెప్పుకొచ్చారు. ఇసుక అవకతవకలపై చాలా కఠినంగా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఇసుకపై సభ్యులు చెప్పిన విషయాలు అన్నీ కఠిన వాస్తవాలు అని అన్నారు. వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలి స్పీకర్ అన్నారు. తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పుకొచ్చారు.

**అధికారంలోకి వచ్చిన వెంటనే...** కాగా.. వైసీపీ ప్రభుత్వం హయాంలో భారీగా ఇసుక కుంభకోణం జరిగింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇసుక సమస్య కారణంగా నిర్మాణ రంగంలో ఇబ్బందులు తలెత్తాయి. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక లభ్యతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టిసారించారు. అనుకున్నదే తడువుగా ఉచిత ఇసుక పాలసీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈనెల రెండో వారంలో ఉచిత ఇసుక పాలసీ జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. పాత ఇసుక విధానాన్ని రద్దు చేస్తూ సర్కార్ ఉత్తర్వులు ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వంలోని 2019, 2021 ఇసుక విధానాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం ఇచ్చిన రెండు ఇసుక పాలసీలను రద్దు చేస్తున్నట్టు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉచిత ఇసుకపై విధి విధానాలు ఖరారు చేస్తూ జీవో విడుదల చేసింది. 2024 కొత్త ఇసుక విధానాన్ని రూపొందించేంత వరకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ లేకుండా ఇసుక సరఫరా జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వినియోగదారులకు ఇసుకను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఇసుక సరఫరాపై మార్గదర్శకాల విడుదల చేసింది. ఇసుక తవ్వకాల నిమిత్తం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఇసుక కమిటీల్లో జిల్లా ఎస్పీ, జేసీ సహా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఉండనున్నారు. జిల్లాల్లోని స్టాక్ పాయింట్లను స్వాధీనం చేసుకోవాలని జిల్లా ఇసుక కమిటీలకు సర్కార్ సూచనలు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## మత్స్యకారులకు గుడ్ న్యూస్ చెప్పిన అచ్చెన్నాయుడు



అమరావతి: మత్స్య కార్మికులకు ప్రతిబంధకంగా ఉన్న 217 జీవోను రద్దు చేస్తామని వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాది వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా అచ్చెన్న మాట్లాడుతూ.. త్వరలో కేబినెట్‌లో పెట్టి ఈ జీవోను రద్దు చేస్తామన్నారు. ఈ జీవోను రద్దు చేయాలని గతంలో అనేక ఆందోళనలు జరిగాయని పేర్కొన్నారు. గతంలో ప్రతిపక్షనేత గా ఉ న్న సమయంలో చంద్రబాబు ఈ జీవోను రద్దు చేస్తానని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. మత్స్యకారుల ఉనికికి, ఉపాధికి విఘాతం కలిగించే జీవోయే నెం.217. రాష్ట్ర వ్యాప్తంగా 2800 సొసైటీల పొట్టకొట్టే, లక్షలాది మంది మత్స్యకారులు రోడ్డున పడేలా అప్పట్లో జగన్ ప్రభుత్వం 217 జీవోను రూపొందించింది. అనాదిగా చెరువుల్లో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్న మత్స్యకారులను పట్టించుకోకుండా టెండర్లు పిలిచి దళారులకు దోచిపెట్టేలా సీఎం వ్యవహార శైలి ఉందంటూ అప్పట్లో టీడీపీ నేతలు పలుమార్లు ఆందోళనలు చేశారు. ప్రస్తుతం ఉచిత గ్యాస్ సిలెండర్‌లను రాష్ట్ర ప్రభుత్వం అందించడం లేదని మంత్రి నాదేండ్ల మనోహర్ అన్నారు. అయితే 2016 నుంచి 24 వరకూ ప్రధాన మంత్రి ఉజ్వల యువజనం పథకం కింద కొంతమందికి ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంయూఐ పథకం కింద మొదటి ఉచిత ఎల్పీజీ కనెక్షన్, సిలండర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా మా మ్యానిఫెస్టోలో మహిళలకు ఉచిత గ్యాస్ సలెండర్‌లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఉచిత గ్యాస్ సిలెండర్ గురించి త్వరలో నిర్ణయం తీసుకొని వివిధ శాఖలతో చర్చించి సభా ముఖంగా మరోసారి వివరాలు తెలియజేస్తామన్నారు. రాష్ట్రంలో త్వరలోనే 674 కోట్లు ధాన్యం బకాయిలు రైతులకు అందిచాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. గతంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను రైతు సహాయ కేంద్రాలుగా మార్చుతున్నామని నాదేండ్ల మనోహర్ తెలిపారు.

## 150 వాహనాల్లో అనంతపురం పీఎస్‌కు వచ్చిన జేసీ ప్రభాకర్‌రెడ్డి



అనంతపురం: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, తెదేపా నేత జేసీ ప్రభాకర్ రెడ్డి అనంతపురం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అక్కడ నిరసన తెలిపేందుకు తాడిపత్రి నుంచి సుమారు 150 వాహనాల్లో అనుచరులతో పీఎస్ వద్దకు చేరుకున్నారు. త మపై నమోదు చేసిన అక్రమ కేసులకు ఆధారాలు చూపించాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట జేసీ ఆందోళనకు దిగారు. పోలింగ్ రోజు జరిగిన అల్లర్లలో తెదేపా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. రాళ్ల దాడి కేసుల్లో పోలీసులు వైకాపాకు అనుకూలంగా వ్యవహరించారని మండిపడ్డారు.




## సంబరాలు చేసుకుంటున్న తెలుగు ప్రజలు..

న్యూఢిల్లీ: తెలుగుదేశం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. జగన్ ఒకసారి చరిత్ర తిరగేయాలి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారపక్షానికి ఎలా సహకరించాలో తెలుసుకోవాలని సూచించారు. 2017లో విశాఖపట్నంలో పారిశ్రామిక సదస్సు జరుగుతున్నప్పుడు జగన్ ధర్నాచేశారన్నారు. గాయపడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చికిత్స జరిగిందని అందరూ అనుకుంటున్నారని, ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ఉ న్న తెలుగు ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఎన్డీఏను ఆదరిస్తూ ప్రజలిచ్చిన తీర్పుకు తగ్గట్టు బడ్జెట్ కేటాయింపులు జరిగాయని, ఇలా సంబరాలు చేసుకుంటున్న సమయంలో దేశ, రాష్ట్ర ప్రతిష్టను మంటగలిపేలా జగన్ వ్యవహరిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు విమర్శించారు. ప్రతిపక్ష పాత్రను నిర్మాణాత్మకంగా పోషించి సూచనలు చేస్తే స్వాగతిస్తారన్నారు. ప్రతిపక్ష హోదా లేనప్పటికీ అసెంబ్లీ చర్చించాలని, సమస్యలు ఏవైనా ఉంటే గుర్తించి మంచి సూచనలు ఇవ్వాలన్నారు. డివైడర్ ఢీ కొట్టి చనిపోతే కూడా రాజకీయ హత్య అంటున్నారని, టీడీపీకి కక్షసాధింపు ఆలోచన అన్నదే లేదని.. ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఏపీ రాష్ట్రం ఇబ్బందులో ఉందని, సూచనలిచ్చి సహకరించాలన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి సమయంలో మంచి పనులు చేస్తే అభినందించిన సందర్భాలున్నాయని.. జగన్ అభినందించకపోయినా ఫరవాలేదు.. కానీ రాష్ట్ర పరువు తీసే పనులు చేయవద్దని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు సూచించారు. కాగా విజయనగరం ఎంపీగా ఎన్నికైన తర్వాత తొలిసారి పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అందరి దృష్టి ఆకర్షించారు. ఢిల్లీలో నివాసం ఉంటున్న అతిథి గృహం నుంచి సైకిల్ తొక్కుకుంటూ పార్లమెంట్‌కు వెళ్లారు. ముందుగా తన తల్లికి పాదాభివందనం చేసిన అనంతరం కుటుంబంతో కలిసి బయటకు వచ్చారు. అక్కడి నుంచి సైకిల్‌పై పార్లమెంట్‌కు బయలుదేరారు.

## ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక

రాజమండ్రి: ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అల్లూరి జిల్లా, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాలపై వరద ప్రభావం తీవ్రంగా ఉంది. అల్లూరి జిల్లాలో 100 కు పైగా లోతట్టు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. చింతూరు నుంచి ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాలకు ఐదు రోజులుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాల్లోనే డ్రైవర్లు వంటలు చేసుకుంటున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పి.గన్నవరం, మామిడికుదురు,అయినవిల్లి మండలాల్లో లంక గ్రామాలు జలదిగ్బందంలో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 55 వేల ఎకరాలకు పైగా వరి, 30 వేల ఎకరాలకు పైగా నారుమళ్ళు, 1400 ఎకరాలకు పైగా ఉద్యాన, కూరగాయలు పంటలు నీటమునిగాయి. భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. 46.07 అడుగుల వద్ద గోదావరి ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం 10,83,684 క్యూసెక్కులకు చేరుకుంది. మొదటి ప్రమాద హెచ్చరిక ఇంకా కొనసాగుతోంది. గోదావరి వరదపై అధికారులతో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నానికి వరద ప్రవాహం తగ్గవచ్చని పేర్కొన్నారు. గోదావరి పరివాహ ప్రాంతంలో గడిచిన 12 నుంచి 18 గంటల్లో వర్షపాతం నమోదు అవ్వలేదని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. వరద నీరు ఇప్పుడిప్పుడే కాస్త తగ్గుముఖం పడుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద నీరు ఎగువ నుంచి నిలకడగా చేరుతోంది. ప్రస్తుతానికి 14.50లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదలవుతోంది.

# అవికా గోర్ పెళ్లికి వయసు అడ్డు చెబుతోందా?

అవికాగోర్– మిలంద్ చాంద్వానితో లవ్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయం బయటకు వచ్చి ఏడాది అవుతుంది. స్టిల్ ఇంకా లవ్ లోనే ఉన్నారు. పెళ్లి అనే టాపిక్ ఇంకా రాకుండా ఇద్దరు లవ్ లైఫ్ ని ఆస్వాదిస్తున్నారు. అయితే నెట్టింట ఇద్దరు పెద్దగా ప్రచారం కోరుకునే ప్రేమికులు కాదు. ఏం చేసినా అంతా కామ్ గా ఉండాలి అన్న టైప్. వెకేషన్లకు వెళ్లినా...కలిసి కాఫీలు..టీలు తాగినా ఆ ఫోటోలు ఎక్కడా లీక్ అవ్వకుండా జాగ్రత్త పడుతుంటారు. ఒకవేళ లీక్ అయ్యాయి? అంటే అవి అధికారికంగా వచ్చినవి అన్నట్లే లెక్క. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు మరోసారి లవ్ స్టోరీ గురించి ఇలా చెప్పుకొచ్చింది. కామన్ ఫ్రెండ్ ద్వారా మిలంద్ పరిచమయ్యాడు. ఆరు నెలల పాటు స్నేహంగా ఉన్నాం. తొలి ప్రపోజల్ అతడి నుంచే



వచ్చింది. నా అభిప్రాయాల్ని అతడు గౌరవించిన విధానం ఎంతో నచ్చింది. అందుకే అతడి ప్రతిపాదనకి ఒకే చెప్పా. మా మనసులు కలిసాయి. నా దృష్టిలో మానసికంగా మా పెళ్లి ఎప్పుడో అయిపోయింది. పెళ్లి గురించి చాలాసార్లు చర్చించుకున్నాం. వయసు రీత్యా చాలా వ్యత్యాసం ఉంది. పెళ్లి అనేది జీవితంలో ముఖ్యమైన విషయం కాబట్టి అన్ని విషయాలు ఆలోచించి తీసుకోమని చెప్పాడు. అందుకే ఆ విషయం గురించి ఆలోచిస్తున్నా అని తెలిపింది. మనసులు కలిసినా పెళ్లి విషయంలో వయసు వ్యత్యాసం ఉండటంతో అవికా ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. మరి తుదిగా అవికాగోర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది చూడాలి. ఇక అవికా కెరీర్ ఎలా సాగుతుందన్నది తెలిసిందే. కొంత కాలంగా పెద్దగా అవకాశాలు కూడా రావడం లేదు. చేసిన సినిమాలేవి సరైన ఫలితాలు సాధించడం లేదు. ప్రస్తుతం బాలీవుడ్ బ్లడ్ ఇష్క్ అనే చిత్రంలో నటిస్తోంది. ప్రస్తుతానికి చేతిలో ఉన్న ఒకే ఒక్క సినిమా ఇది. గత ఏడాది మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే.

# మూడేళ్లగా మిస్ యూనివర్స్ సింగిల్ గానే!

మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్ ప్రేమాయాణాలు..వాటి బ్రేకప్ స్టోరీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటి వరకూ సుస్మితాసేన్ ఖాతాలో 11 మంది తో డేటింగ్ చేసింది. ప్రస్తుతం ఆ 11 నెంబర్ కూడా వీగిపోయింది. మళ్లీ ఓల్డ్ బోయ్ ఫ్రెండ్ రోహ్మాన్ షానే మళ్లీ తెరపైకి తెస్తుంది? అన్న ప్రచారం కూడా సాగింది. కానీ ఇంతవరకూ అధికారికంగా ప్రకటించింది లేదు. అప్పుడప్పుడు జంటగా బయట మాత్రం కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సుస్మితాఖాన్ రిలేషన్ షిప్ పరోక్షంగా హిట్ ఇంచ్చింది. నా జీవితంలో ఇప్పుడు ఏ పురుషుడు లేడు. మూడేళ్లగా సింగిల్ గానే ఉంటున్నా. ప్రేమ, బంధం అనే వాటి వెనుక పరిగెత్తే ఆలోచన కానీ, ఆసక్తికానీ రెండు లేవు. అంతకు ముందు ఒకరితో ఐదేళ్ల పాటు రిలేషన్ లో ఉన్నాను. ఆ బ్రేకప్ తర్వాత ఎంతో స్వేచ్ఛగా జీవిస్తున్నాను. అలాగే నేనిప్పుడు పెళ్లి



చేసుకుంటానంటే నా పిల్లలు కూడా ఒప్పుకోవడం లేదు. ఓ అబ్బాయిని పెళ్లి చేసుకుంటే ఎలా ఉంటుందని మా పెద్దమ్మాయిని అడిగితే అతడినే కాదు..ఎవర్నీ పెళ్లి చేసుకోవద్దు అని చెబుతుంది. వివాహం చేసుకోవాల్సిన అవసరం ఏముంది? నీకు నచ్చినట్లు నీ జీవితాన్ని గడుపు. పెళ్లి గురించి ఆలోచించాల్సిన పనేముందని ప్రశ్నిస్తుంది అని తెలిపింది. పిల్లలు అంటే సుస్మితాసేన్ పేగు తెంచుకుని పుట్టిన వారు అనుకునేరు. ఆమె దత్తత తీసుకున్న పిల్లలు. వీళ్లని సొంత పిల్లలుగా చూసుకుంటుంది. మంచి చదువులు చెప్పిస్తోంది. ఇక సుస్మితాసేన్ కెరీర్ సంగతి చూస్తే చాలా కాలం తర్వాత తాలీ అనే వెబ్ సిరీస్ లో నటించి ఇండస్ట్రీని షేక్ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ట్రాన్స్ జెండర్ పాత్రలో నటించి ఇండియానే ఆడించింది. ట్రాన్స్ జెండర్స్ హక్కుల కోసం పోరాడిన 'గౌరీ సావంత్' జీవితం ఆధారంగా తెరకెక్కిన సిరీస్ లో సుస్మితా సేన్ నట విశ్వరూపం చూపించింది. ఇండియా మొత్తం ఆమె గురించి మాట్లాకునే రేంజ్ లో నటించింది.




# హిందీలో టాప్ కలెక్షన్స్ అందుకున్న సౌత్ హీరోల సినిమాలివే




పాన్ ఇండియా మార్కెట్ క్రియేట్ అయ్యాక సౌత్ హీరోలు బాలీవుడ్ లో సత్తా చాటుతున్నారు. నార్త్ ఇండియన్ మార్కెట్ లో మన సౌత్ హీరోలతో తెరకెక్కి హిందీ వెర్షన్ లో రిలీజ్ అయిన సినిమాలు సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకొని బాక్సాఫీస్ దగ్గర భారీ కలెక్షన్స్ అందుకుంటున్నాయి. ముఖ్యంగా సౌత్ ఇండియన్ స్టార్స్ నుంచి వస్తోన్న సినిమాల కంటెంట్ నచ్చడంతోనే నార్త్ ఇండియన్స్ ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. లాంగ్ రన్ లో అద్భుతమైన వసూళ్లని మన సినిమాలు నార్త్ ఇండియన్ మార్కెట్ సొంతం చేసుకుంటున్నాయి. హిందీ వెర్షన్ లో రిలీజ్ అయ్యి అత్యధిక కలెక్షన్స్ సొంతం చేసుకున్న సౌత్ హీరోల సినిమాలు ఏంటనేది చూసుకుంటే మొదటి స్థానంలో బాహుబలి పార్ట్ 1 కనిపిస్తోంది. డార్లింగ్ ప్రభాస్ నటించిన ఈ సినిమా హిందీలో ఈ ఏకంగా 511 కోట్ల కలెక్షన్స్ సొంతం చేసుకుని టాప్ లో నిలిచింది. దీని తర్వాత రాకింగ్ స్టార్ యష్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో వచ్చిన కేజీఎఫ్ చాప్టర్ 2 మూవీ 435.2 కోట్ల కలెక్షన్స్ తో రెండో స్థానంలో ఉంది. ఈ ఏడాది యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కి గ్రాండ్ గా రిలీజ్ అయిన కల్కి 2898ఏడీ మూవీ ఇప్పటివరకు 257.40 కోట్ల కలెక్షన్స్ అందుకొని మూడవ స్థానంలోకి వచ్చింది. నెక్ట్స్ రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్ చరణ్ కాంబినేషన్ లో మల్టీ స్టారర్ గా రిలీజ్ అయిన ఆర్ఆర్ఆర్ సినిమా 276.8 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ తో నాలుగువ స్థానంలో ఉంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నుంచి రోబో సీక్వెల్ గా వచ్చిన 2.ఓ మూవీ 189 కోట్ల కలెక్షన్స్ తో టాప్ 5 మూవీగా నిలిచింది. తర్వాత 153.45 కోట్ల కలెక్షన్స్ తో సలార్ పార్ట్ 1 టాప్ 6లో ఉండగా, సాహో మూవీ 150.6 కోట్లతో టాప్ 7 హైయెస్ట్ కలెక్షన్స్ సినిమాలుగా ఉన్నాయి. ప్రభాస్ ఆదిపురుష్ మూవీ డిజాస్టర్ అయిన కూడా 143.25 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ ని హిందీలో అందుకుంది. తద్వారా టాప్ 8లో నిలిచింది. బాహుబలి పార్ట్ 1 మూవీ 115 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప పార్ట్ 1 మూవీ ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజ్ అయ్యి 108.61 కోట్ల గ్రాస్ వసూళ్లని హిందీ మార్కెట్ లో కలెక్ట్ చేసింది. ఈ రెండు సినిమాలు టాప్ 9, 10 స్థానాలలో ఉండడం విశేషం.

# టాలీవుడ్ డిసెంబర్ లెక్క ఫైనల్ గా తేలేదెన్ని?



టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ ఏడాది ప్రథమార్ధం లో ఆశించిన స్థాయిలో సక్సెస్ లు లేవు. అలాగే ఫేమ్ ఉన్న సినిమాలు రిలీజ్ కూడా తక్కువగానే జరిగాయి. వాటిలో కరెక్ట్ గా చూసుకుంటే హనుమాన్, డీజే టిల్లు, కల్కి 2898ఏడీ సినిమాలు మాత్రమే బ్లాక్ బస్టర్ హిట్ అయ్యాయి. మరికొన్ని సినిమాలు కమర్షియల్ సక్సెస్ అందుకున్నాయి. చాలా వరకు సినిమాల డిజాస్టర్ టాక్ తెచ్చుకొని నిర్మాతలకి ఫైనాన్షియల్ గా నష్టాలు తీసుకొచ్చాయి. అయితే ఈ ఏడాది సెకెండాఫ్ మాత్రం టాలీవుడ్ ప్రేక్షకులకి అయితే మంచి రోజులు అని చెప్పొచ్చు. టైర్ 1, టైర్ 2 హీరోలు చేస్తోన్న సినిమాలలో చాలావరకు ద్వితీయార్ధంలోనే రానున్నాయి. ప్రతి నెల గుర్తింపు ఉన్న సినిమాలు 2–3 రిలీజ్ కాబోతున్నాయి. వాటిలో చాలా సినిమాలపై పాజిటివ్ వైబ్ ఉంది. అయితే ఈ ఏడాది ఆఖరున డిసెంబర్ మాత్రం నిర్మాతలకి పెద్ద తలనొప్పిగా మారిందని చెప్పాలి. డిసెంబర్ లో ఇప్పటికే అఫీషియల్ గా మూడు సినిమాలు టాలీవుడ్ నుంచి రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేసుకున్నాయి. మరో మూడు, నాలుగు సినిమాలు కూడా డిసెంబర్ లో రిలీజ్ కి రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 6న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ పుష్ప ది రూల్ గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమా కోసం దేశ వ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ తర్వాత నితిన్ రాబిన్ హుడ్ డిసెంబర్ 20న రిలీజ్ కానుంది. ఈ సినిమాపై నితిన్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. అలాగే అక్కినేని నాగ చైతన్య హీరోగా తెరకెక్కుతోన్న తండేల్ మూవీ డిసెంబర్ 20న పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ కానుంది. ఈ మూడు సినిమాలు మాత్రమే కాకుండా తమిళ్ నుంచి కొన్ని డబ్బింగ్ సినిమాలు డిసెంబర్ నెలలో రిలీజ్ కాబోతున్నాయి. రామ్ చరణ్, శంకర్ కాంబినేషన్ లో రెడీ అవుతోన్న గేమ్ చేంజర్ మూవీని కూడా డిసెంబర్ లోనే రిలీజ్ చేయాలని అనుకుంటున్నారు. నిజానికి ముందుగానే రిలీజ్ అనుకున్న కూడా పోస్ట్ ప్రొడక్షన్ అయ్యేసరికి లేట్ అవుతుందని డిసెంబర్ లో రావాలని అనుకుంటున్నారంట. నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న NBK109 మూవీ కూడా డిసెంబర్ లోనే రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

పుష్ప ది రూల్ మూవీ వాయిదా పడితే ఆ డేట్ కి NBK109 సినిమాని రిలీజ్ చేయాలనీ అనుకుంటున్నారంట. అలాగే మంచు విష్ణు కన్నప్ప సినిమాని డిసెంబర్ లో రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించాడు. డేట్ మాత్రం ఇంకా కన్ఫర్మ్ చేయలేదు. ఓవరాల్ గా చూసుకుంటే డిసెంబర్ నెలలో 6 తెలుగు సినిమాలు థియేటర్స్ లోకి రాబోతున్నాయి. వీటిలో ఎన్ని ఫైనల్ గా ఆ నెలలో రిలీజ్ కి అందుబాటులోకి వస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ప్రగ్య నవ్వులు సిగ్గుల మొగ్గలు

ప్రగ్యా జైశ్వాల్.. పరిచయం అవసరం లేని పేరు. ముంబై టు హైదరాబాద్ ప్రగ్య జర్నీ గురించి తెలిసిందే. టాలీవుడ్ లో అడుగుపెడుతూనే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన కంచె చిత్రంలో నటించింది. ఈ సినిమా తర్వాత స్నేహితుల అండదండలతో ప్రగ్య కెరీర్ కొన్నాళ్ల పాటు ముందుకు సాగిందని ప్రచారమైంది. కానీ ఇటీవల ప్రగ్యకు ఆశించిన అవకాశాల్లేవ్. అటు బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ సినిమాలో అవకాశం వచ్చినా కానీ, ఆ సినిమా (కిసీ కా భాయ్..) ఫ్లాపవ్వడం తనకు పెద్ద మైనస్ అయింది. అదంతా అటుంచితే ప్రగ్య సోషల్ మీడియాల్లో నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉంది. వారికి అవసరమైన ట్రీట్ ఇస్తూనే ఉంది. తాజాగా ప్రగ్య షేర్ చేసిన కొన్ని ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి. వీటిలో ప్రగ్య అందమైన



నవ్వు, అలంకరణ, సిగ్గు పడే విధానం యువతరాన్ని హత్తుకుంటున్నాయి. ప్రగ్య చిలుకాకు పచ్చ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపిస్తోంది. అంతకుమించి ఈ డిజైనర్ లుక్ నిజంగా కవ్విస్తోంది! ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. అఖండ, సన్నాఫ్ ఇండియా తర్వాత ప్రగ్య టాలీవుడ్ లో నటించలేదు. ప్రస్తుతం హిందీలో %-%ఖేల్ ఖేల్ మై%-% అనే క్రేజీ చిత్రంలో నటిస్తోంది. ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్, ఫర్దీన్ ఖాన్, తాప్సీ తదితరులు నటిస్తున్నారు. ఈ మల్టీస్టారర్ లో ప్రగ్య పాత్ర ఆకట్టుకునేంతగా ఉందా లేదా? అన్నది ఇంకా తెలీదు. ఇప్పుడు తన కెరీర్ కి బ్రేక్ నిచ్చే ఛాయిస్ అవుతుందా లేదా? అన్నదానికి కాలమే సమాధానం చెప్పాలి.

# అరియానా పాప స్టన్నింగ్ లుక్స్.. ఫిదా అవ్వాల్సిందే..

అరియానా గ్లోరీ.. హీరోయిన్లకు మించిన క్రేజ్ ను సోషల్ మీడియా ద్వారా సంపాదించుకున్న విషయం తెలిసిందే. నార్మల్ యాంకర్ గా ఉన్న అరియానా.. ఆర్జీవీని ఇంటర్వ్యూ చేసి ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చేసింది. అందులో అరియానా తొడలపై రామ్ గోపాల్ వర్మ చేసిన వెకిలి కామెంట్లు అప్పట్లో తెగ వైరల్ అయ్యాయి. దీంతో విపరీతమైన పాపులారిటీని దక్కించుకుంది. ఆ క్రేజ్ కారణంగానే బిగ్ బాస ఆఫర్ కొట్టేసింది అమ్మడు. అయితే బిగ్ బాస్ షోలో తన అందం, ఆటతో అందరినీ అలరించింది. తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చాక కూడా ఆర్జీవీతో కలిసి వర్కౌట్స్, ఇంటర్వ్యూలు చేస్తూ మళ్ళీ సంచలనం సృష్టించింది. కొత్తవి, పాతవి అలా అన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. ఆ తర్వాత పలు షోలకు యాంకరింగ్ చేసి సందడి చేసింది బ్యూటీ. ప్రస్తుతం అనేక వెబ్ సిరీసుల్లో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతోంది. తనను తాను ప్రమోట్ చేసుకోవడంలో భాగంగా.. ఎప్పటికప్పుడు సోషల్



మీడియాలో అందాలు ఆరబోస్తుంటోంది అరియానా. గ్లామర్ ట్రీట్స్ ఇస్తూ కుర్రాళ్ల మతులు పోగుడుతుంటోంది. స్కిన్ షోలో హద్దులు చెరిపేసి పోజులు ఇస్తోంది అమ్మడు. హీరోయిన్లతో సమానంగా ఫోటో షూట్స్ చేస్తూ అదరగొడుతుంటోంది. తన లేలేతప్రాయాలను నెట్టింట షేర్ చేస్తూ అలరిస్తుంటోంది. తాజా అదిరిపోయే పిక్స్ ను షేర్ చేసింది అరియానా. టార్న్ జీన్ ప్యాంట్, వైట్ ఇన్నర్ తో ఫోటోలు దిగి మైండ్ బ్లాక్ చేసింది అమ్మడు. నాభి, ఎద అందాలతో కవ్విస్తోంది. నడుమును వయ్యారంగా చూపిస్తూ మాయ చేస్తోంది. హీట్ పుట్టించే ఫోజులతో సెగలు పుట్టిస్తోంది. ఓ రేంజ్ లో ఎక్స్ప్రెసన్స్ ఇస్తూ అందరినీ ఫ్లాట్ చేస్తోంది. స్టన్నింగ్ లుక్స్ తో ఫిదా చేస్తోంది.

మోడ్రన్ ఔట్ ఫిట్ లో అమ్మడు దిగిన పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆరియానా పిక్స్ చూసి ఫ్లాట్ అయిన కుర్రాళ్ళు.. లైకుల వర్షం కురిపిస్తున్నారు. ఫైర్ ఎమోజీస్ పెడుతూ కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. అమ్మడి బ్లాస్టింగ్ అందాలు చూసి మైమరచిపోయినట్లు చెబుతున్నారు. బ్యూటీ అందాల జాతరకు ఎవరైనా ఫ్లాట్ అవ్వకుండా ఉంటారా అని అంటున్నారు. బిగ్ బాస్ పిల్ల పిక్స్ ను తెగ షేర్ చేస్తూ వైరల్ చేస్తున్నారు. మరి యూత్ కు నిద్ర లేకుండా చేస్తున్న అరియానా పిక్స్ ను మీరు చూశారా?




## శాసనసభలో రేవంత్‌రెడ్డి, కేటీఆర్ మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, భారాస ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. అవగాహనా రాహిత్యంతో కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని రేవంత్ అన్నారు. కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు కేసీఆర్ ఎందుకు రాలేదని సీఎం ప్రశ్నించారు 'మాకు జవాబు చెప్పండి చాలు. మీకు కేసీఆర్ అవసరం లేదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించడంతో సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "తండ్రి పేరు చెప్పుకొని నేను మంత్రిని కాలేదు. కింది స్థాయి నుంచి ఎదిగి ముఖ్యమంత్రిని అయ్యా. కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా అనుకున్నా. అంతకంటే దారుణం" అని అన్నారు. ఆ వెంటనే కేటీఆర్ స్పందిస్తూ 'రేవంత్ పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని మేమూ అనొచ్చు' అని వ్యాఖ్యానించారు. దానికి రేవంత్ మళ్లీ కౌంటర్ ఇస్తూ 'పేమెంట్ కోటాలో సీఎంను కాలేదు. మొన్న భారాస నేతలు దిల్లీ వెళ్లి చీకట్లో మాట్లాడుకొని వచ్చారు' అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ స్పందిస్తూ "మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యానని సీఎం అనొచ్చా? సభా నాయకుడు అలా మాట్లాడొచ్చా?" అని ప్రశ్నించారు.

**యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి: కేటీఆర్ –** అనంతరం కేటీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చర్చను సమర్థిస్తున్నట్లు తెలిపారు. "విభజన సమయంలో తెలంగాణ హక్కుల కోసం ఎంతో పోరాడాం. మోదీ సర్కారుపై తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశాం. రాష్ట్ర హక్కులు ఎవరు హరించినా వారి మెడలు వంచుతాం. యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి. దిల్లీ తత్వం ఇంతకాలానికి కాంగ్రెస్‌కు బోధపడింది. భాజపాకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మీకేం ఇబ్బంది? కేంద్ర వివక్షను ఎండగట్టడంలో మేం సహకరిస్తాం. గతంలో కేంద్రం సాయం చేయకపోయినా ఎంతో అభివృద్ధి చేశాం. రేవంత్ రెడ్డి కష్టపడే ఈ స్థాయికి చేరుకున్నారు. చిన్నవయసులోనే సీఎం అయ్యారు" అని కేటీఆర్ అన్నారు.

**మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: భట్టి –** తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. "హైదరాబాద్ పవర్ సర్కిల్‌ను ప్రైవేటు వాళ్లకు ఇస్తున్నట్లు ఎక్కడా చెప్పలేదు. ఎవరో పత్రికల్లో రాసినదాన్ని పట్టుకుని సభలో మాట్లాడితే ఎలా? కేటీఆర్ సభతోపాటు రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. భారాస వాళ్లలా ఏది పడితే అది చేసేవాళ్లం కాదు. సింగరేణి అంశంపై చర్చించేందుకు మేం సిద్ధం" అని భట్టి స్పష్టం చేశారు.



## కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బీఆర్ఎస్ బృందం.. ఎప్పుడంటే?

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించేందుకు గురువారం రోజున బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం వెళ్లనుంది. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే వారంతా బయలుదేరనున్నారు. అసెంబ్లీ నుంచి భారీ ర్యాలీగా ప్రత్యేక బస్సుల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లనున్నారు. కాళేశ్వరం చేరుకుని మొదటగా LMD రిజర్వాయర్ సందర్శిస్తారు. అనంతరం గురువారం రాత్రి రామగుండంలో బీఆర్ఎస్ బృందం బస చేయనుంది. ఎల్లుండి 10గంటలకు కన్నెపల్లి పంపు హౌజ్, 11గంటలకు మేడిగడ్డ బ్యారేజీ సందర్శిస్తారు. అనంతరం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ పర్యటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కాళేశ్వరంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని గులాబీ శ్రేణులు మండిపడుతున్నారు. ప్రాజెక్టు పగుళ్లు, ఇసుకలో కూరుకుపోతోందంటూ చేసే ప్రచారాలు మానుకోవాలని హితవు పలుకుతున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టును బీఆర్ఎస్ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సోమవారం రోజున సందర్శించారు. పదిలక్షల క్యూసెక్కుల నీళ్లు తట్టుకుని మేడిగడ్డ నిలబడినట్లు ఆయన చెప్పుకొచ్చారు. దీనిపై తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆధ్వర్యంలోనూ బృందం పర్యటనకు వెళ్లనుండడంతో రాజకీయంగా ఆసక్తి వాతావరణం నెలకొంది.

## 24 వేల స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చాం: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్: తెలంగాణలో స్కూల్, కళాశాల బస్సుల ప్రమాదం జరగకుండా తీసుకుంటున్న చర్యలపై శాసనసభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ప్రశ్నోత్తరాలు సమయంలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. "పాఠశాలలకు సంబంధించి దాదాపు 24 వేల బస్సులు ఉన్నాయి. పాఠశాలల ప్రారంభానికి నెల ముందు నుంచే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చాం. ప్రతి స్కూల్ బస్సులకు తప్పనిసరి చేశాం. స్లాట్ బుక్ చేసుకుని ఆన్‌లైన్‌లో బస్సులతోపాటు డ్రైవర్లు, అదనపు డ్రైవర్లు, అటెండర్లకు కౌన్సిలింగ్ ఇచ్చాకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలకు అనుగుణంగా 15 సంవత్సరాలు దాటిన వాహనాలను స్క్రాప్ కింద తీసుకొని బస్సులు నడవకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి బస్సులో ఫైర్, ఫోన్ నంబర్ డిస్‌ప్లే, మెడికల్ కిట్ తప్పనిసరి చేశాం. పాఠశాల విద్యార్థుల బస్సులను సమయానికి నడపాలని సభ్యులు సూచించారు. పాఠశాల ఏరియాల వారీగా బస్సులు నడిపేలా కార్యక్రమం తీసుకుంటాం. బస్సుల అవసరాల బట్టి అదనంగా తీసుకోవాలని సీఎం సూచించారు. బస్సుల్లో సేఫ్టీ నిబంధనలతోపాటు కఠినంగా వ్యవహరించాల్సి ఉందని రవాణా శాఖ సమీక్షలో ఆదేశాలు ఇచ్చా. పిల్లలకు ట్రాఫిక్స్ రూల్స్పై అవగాహన ఉండాలని UNICEF ఆధ్వర్యంలో ప్రతి స్కూల్లో ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం. ఈ విషయంలో విద్యాశాఖతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తున్నాం" అని మంత్రి తెలిపారు.




## తెలంగాణ శాసనసభలో ఆర్టీసీపై వాడీవేడి చర్చ

హైదరాబాద్: తెలంగాణ శాసనసభలో ఆర్టీసీపై వాడీవేడి చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై అధికారపక్షం నుంచి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్.. ప్రతిపక్షం తరఫున భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. ఈ క్రమంలో అధికార విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "హరీశ్ రావు సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగానూ వ్యవహరించారు. ఆర్టీసీ కార్మికుల తరఫున మాట్లాడేందుకు సీపీఐ సభ్యుడికి సభాపతి అవకాశం ఇచ్చారు. ఆ పార్టీకి ఛాన్స్ ఇవ్వడాన్ని భారాస సభ్యుడు హరీశ్‌రావు ప్రశ్నించడం, స్పీకర్‌పై వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రశ్న అడిగిన వారికే మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఎక్కడా లేదు. ఎవరికి ఇవ్వాలనేది స్పీకర్ విచక్షణ. ఆర్టీసీని ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ఉంది. ఒక కార్మిక నేతను తొలగించేందుకు సంఘాలనే గత ప్రభుత్వం రద్దు చేసింది. సభను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించవద్దని భారాస నేతలకు మనవి చేస్తున్నా" అని అన్నారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ "ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారు? ఆర్టీసీని ప్రభుత్వంలో ఎప్పుడు విలీనం చేస్తారు? విలీనంపై ఎప్పటిలోగా అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటిస్తారు?" అని ప్రశ్నించారు.

**ఆర్టీసీపై రాజకీయం చేస్తున్న భారాస: మంత్రి పొన్నం ప్రభాకర్ –** అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆర్టీసీ అంశాన్ని భారాస రాజకీయం చేస్తోందని వ్యాఖ్యానించారు. "యూనియన్లను రద్దు చేసి.. ఇప్పుడు పునరుద్ధరించాలని మాట్లాడుతున్నారు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసినా గతంలో పట్టించుకోలేదు. ఆర్టీసీ సొమ్మును గత ప్రభుత్వం వాడుకుంది. ఆ సంస్థకు మేం నెలకు రూ.300 కోట్లు ఇస్తున్నాం. ఆర్టీసీకి కొత్త బస్సులు కొంటున్నాం.

కొత్తగా 3,035 మంది ఉద్యోగులను నియమిస్తున్నాం. పని భారం పెరిగినా ఆర్టీసీ కార్మికులు బాగా పని చేస్తున్నారు. వారిని అభినందిస్తున్నా. ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలను మేం చెల్లించాం. ఆర్టీసీ కార్మికులపై భారాస నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు. వారి సంక్షేమం మా బాధ్యత" అని చెప్పారు.



## సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

దిల్లీ: సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్‌కు చెందిన పెద్దపల్లి ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. సింగరేణి ప్రైవేటీకరణ ఆలోచన కేంద్రానికి లేదని తెలిపారు. దేశంలో ఏ బొగ్గు గనినీ ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచన లేదని వివరించారు. సింగరేణిని ప్రైవేటుపరం చేయాలంటే... 51 శాతం వాటా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయమే ప్రధానమని పేర్కొన్నారు.

## ఇప్పటి వరకు ఆ చెక్కు బస్ భవన్‌కు చేరలేదు: హరీష్ రావు

హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులను ఎప్పటిలోగా, ఏ రోజు నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారు.. పరిశీలనలో ఉంది.. చూస్తాం.. చేస్తామని కాలయాపన కాదని.. ఖచ్చితమైన తేదీని ప్రకటించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తర సమయంలో ఆర్టీసీపై జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ యూనియన్ పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చారని, ఎప్పటిలోగా పునరుద్ధరిస్తారో చెప్పాలన్నారు. చనిపోయిన కార్మికుల పిల్లలకు వెంటనే ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రూ. 300 కోట్ల బకాయిలు ఇస్తున్నట్లు చెక్కులు చూపించారని, ఇప్పటి వరకు ఆ చెక్కు బస్ భవన్‌కు చేరలేదని హరీష్ రావు అన్నారు. మహాలక్ష్మి పథకం నిధులు నెల నెలా ఆర్టీసీకి ఇస్తున్నారా? ఎప్పటిలోగా ఇస్తారని ప్రశ్నించారు., రెండు పీఆర్సీలు వెంటనే చెల్లిస్తాం అన్నారు.. ఇంత వరకు చెల్లించలేదన్నారు. కాగా హరీష్ రావు మాట్లాడుతుంటే.. మంత్రి శ్రీధర్ బాబు జోక్యం చేసుకుని ఆయన ప్రశ్నోత్తరాలలో స్పీచ్ మొదలు పెట్టారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో భట్టి పట్టినందుకు ధన్యవాదాలు అన్నారు. హరీష్ రావుకు పాస్ మార్కులు వేస్తున్ననని శ్రీధర్ బాబు సెటైర్ వేశారు. 'మా మేనిఫెస్టో భట్టి పట్టినందుకు మీకు తాను సూటిగానే ప్రశ్నలు అడుగుతున్నానని' హరీష్ రావు అన్నారు. హరీష్ రావు వ్యాఖ్యాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వాళ్లు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని, యూనియన్‌లు రద్దు చేసింది ఎవరని ప్రశ్నించారు. రూ. 4 వేల కోట్ల బకాయిలు మాకు ఇచ్చి వెళ్లారని,



ఆర్టీసీ ఉద్యోగులకు పని భారం పెరిగినా డబుల్ పేమెంట్ ఇస్తున్నామన్నారాయన. ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాట పట్టిస్తున్నామని, గతంలో రిటైర్డ్ ఈడీని ఎండిగా పెట్టి సంస్థను నడిపించిన చరిత్ర బీఆర్ఎస్‌దని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ ఆస్తులను మీ నాయకులకు అప్పనంగా అప్పగించారని ఆరోపించారు. గత ఆర్థిక శాఖ మంత్రిగా ఆర్టీసీ మీద మాట్లాడే నైతిక హక్కు హరీష్ రావుకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## చెరో 8 సీట్లు గెలిచి తెలంగాణకు 8 పైసలు కూడా తీసుకురాలేదు

హైదరాబాద్, జూలై 24 : బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపడం పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు మాట్లాడారు. కాంగ్రెస్ , బీజేపీ చెరో 8 సీట్లు గెలిచి తెలంగాణకు 8 పైసలు కూడా తీసుకొని రాలేదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర నిధులు ఇవ్వకుండా అనేక ఇబ్బందులు పెట్టిందని...యినా స్వశక్తితో కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేశారన్నారు. 10 సంవత్సరాల నుంచి ఒక్క పైసా ఇవ్వడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అనేక వాగ్దానాలు చేశారని.. ఇప్పుడు కొత్త నాటకానికి తెరలేపారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీ కేంద్రమంత్రులను కలవడం జరిగిందన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తామని కొత్త నాటకానికి తెరలేపారని వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ కుట్రలను ఎదుర్కోవడం బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదన్నారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు అన్యాయం చేశాయన్నారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ వాళ్ళ హక్కులు కోసం మాట్లాడారని.. మరి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం ఎందుకు అడగలేదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రశ్నించారు.

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...** కేంద్రప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డిన్నారు. "ఒక్కసారి ఆలోచన చేయండి. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు 15వేల కోట్ల రూపాయలు ఇచ్చి తెలంగాణాబకు ఒక్క రూపాయ ఇవ్వకపోవడం బాధాకరం" అని అన్నారు. రెండు జాతీయ పార్టీల ఎంపీలను ఇక్కడ నుంచి గెలిపిస్తే ఒక్క రూపాయ తీసుకొరాలేకపోయారని విమర్శించారు. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని చెప్పుకొచ్చారు. దీనిపై కాంగ్రెస్, బీజేపీ పార్టీని అసెంబ్లీలో నిలదీస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలపైనా నిలదీస్తామని తెలిపారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారని.. ఎక్కడ చేశారని ప్రశ్నించారు. సిగ్గు లేకుండా పేపర్ యాడ్ ఇచ్చుకుంటున్నారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 'గోరటి'కి దాశరథి ప్రజా సాహిత్య పురస్కారం..



హైదరాబాద్ సిటీ: ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న దాశరథి ప్రజాసాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నగేశ్ భీమపాక ఈ పురస్కారాన్ని అందజేసి శాలువ, జ్ఞాపికతో ఆయనను సత్కరించారు. చింతలకుంటలోని వాసవీ శ్రీనిలయం వేదికగా 'మాభూమి సాహితీ సాంస్కృతిక వేదిక' ఆధ్వర్యంలో దాశరథి శత జయంత్యుత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ మాట్లాడుతూ.. దాశరథి అన్నట్టు గాయపడిన ఆ కవి గుండెల్లో రాయబడని కావ్యాలన్నీ గోరటి వెంకన్న రాయాలని ఆకాంక్షించారు. దాశరథి, వెంకన్న.. ఇద్దరూ పీడితుల పక్షాన నిలిచిన కవులంటూ వారిని ప్రజా కవులుగా అభివర్ణించారు. ఈ పురస్కారాన్ని అందుకోవడం తనకు ఆనందంగా ఉందని గోరటి వెంకన్న అన్నారు. తెలంగాణలో ఎంతోమంది గొప్ప కవులు, రచయితలు, కళాకారులకు పుట్టారని, వారంతా తన పాటకు స్ఫూర్తి అని వెల్లడించారు. 'సంతా... మా ఊరి సంత...' పాట ఆలపించి సభను గోరటి వెంకన్న ఉ ద్రూతలూగించారు. ఈ పురస్కారాన్ని ప్రతి ఏటా అందిస్తామని కార్యక్రమ నిర్వాహకుడు గొౖరెపాటి నరసింహ ప్రసాద్ చెప్పారు.

కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తులు కె. మురళీమోహన్, ఎం వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు తాడి ప్రకాష్, రచయిత కూనపరాజు కుమార్ తదితరులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో దాశరథి స్థానం ప్రత్యేకమైనదంటూ కొనియాడారు. ప్రజాక్షేత్రంలో నిలిచి సాహిత్య సృజన చేసిన ఘనత ఆయన సొంతమని శ్లాఘించారు. గోరటి వెంకన్న సాహిత్య కృషిని అభినందిస్తూ మాట్లాడారు.

## నేర విచారణ నుంచి గవర్నర్లకు రక్షణపై.. సుప్రీం కీలక నిర్ణయం

దిల్లీ: పశ్చిమ బెంగాల్ గవర్నర్‌పై ఇటీవల ఓ మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో అత్యున్నత న్యాయస్థానం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. నేర విచారణ నుంచి గవర్నర్‌కు మినహాయింపు కల్పించే ఆర్టికల్ 361 రాజ్యాంగ నిబంధనను పరిశీలించేందుకు అంగీకరించింది. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తనను లైంగిక వేధింపులకు గురిచేశారంటూ అక్కడి రాజ్‌భవన్‌లో తాత్కాలిక సిబ్బందిగా పని చేస్తున్న ఓ మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన బాధిత మహిళ.. గవర్నర్లకు రక్షణ కల్పించే రాజ్యాంగంలోని 361వ అధికరణపై న్యాయ సమీక్ష చేయాలని అభ్యర్థించారు. నేర విచారణ నుంచి మినహాయింపు ఇచ్చే విషయంలో నిర్దిష్ట మార్గదర్శకాలను రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందుకు అంగీకరించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే.. ఈ అంశంలో తమకు కోర్టు సాయం చేయాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 కింద.. రాష్ట్రపతి లేదా గవర్నర్ తన అధికారాలు, విధులను నిర్వర్తించే విషయంలో ఏ కోర్టుకు జవాబుదారీగా ఉండరు. ఉద్యోగం విషయంలో ప్రయోజనాలు చేకూర్చుతానన్న నెపంతో గవర్నర్ ఆనంద బోస్ తనను పలుమార్లు వేధించారని ఈ ఏడాది మే నెలలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను గవర్నర్ కార్యాలయం ఖండించింది. ఎన్నికల వేళ ప్రభుత్వం తనపై ఇలాంటి కుట్రలు పన్నుతోందని గవర్నర్ మండిపడ్డారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com